ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 3, ఫిబ్రవరి 2025



మార్కాపురం డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పక్కన ఎస్పీ దామోదర్

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి
- గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం
- మార్కాపురం డీఎస్పీ కార్యాలయం తనిఖీ

మార్కాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం ఆయన మార్కాపురం డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసులు, క్రైం, జీసీఆర్ రిజిస్టర్లు, ఇతర కేసులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సబ్‌డివిజన్ పరిధిలో నెలకొన్న పరిస్థితులు, నేరాలు, శాంతిభద్రతల అంశాలపై మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజుతో క్షుణ్ణంగా చర్చించారు. గతంలో నమోదైన కేసులు, వాటి దర్యాప్తు తీరు, విచారణ స్థితిగతుల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌తో ఛేదించి నిందితులకు తప్పనిసరిగా శిక్షపడేలా చేయాలన్నారు. ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిపీటెడ్ అఫెండర్స్, భూకబ్జాదారులపై నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరనియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఐజీ త్రిపాఠి అధికారులకు సూచించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలందించాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సేవించడం వలన కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి, సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. వాటి ప్రాముఖ్యతను తెలియజేసి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్పీ దామోదర్, డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు పి.సుబ్బారావు, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్, అన్ని స్టేషన్‌ల ఎస్సైలు పాల్గొన్నారు. ముందుగా జిల్లా 56వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆయన ఎర్రగొండపాలెం తహసీల్దార్. పుల్లలచెరువు మండలానికి కూడా ఇన్‌చార్జిగా సేవలందిస్తున్నారు. ఇదేఅదనుగా ప్రభుత్వ భూముల పందేరానికి తెగబడ్డారు. రెండు చోట్లా కార్యాలయాల్లో ప్రజలకు అరుదుగా కనిపించే ఆయనకు కాసులిస్తే మాత్రం కాని పని అంటూ ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విధుల్లో చేరిన నాలుగు నెలల్లోనే 2వేల ఫైళ్లను క్లియర్ చేశారు. ఆ విషయంలో 'అంతా నా ఇష్టం' అన్నట్లు వ్యవహరించారు. కనీసం కిందిస్థాయి సిబ్బంది పరిశీలన కూడా లేకుండానే పెద్దఎత్తున భూములను ఆన్‌లైన్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. దీని వెనుక భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో సదరు తహసీల్దార్ సెలవుపై వెళ్లారు. అసలేం జరిగిందన్న విషయమై ఆరా తీయగా విస్తుగొలుపే అనేక అక్రమాలు బయటపడుతున్నాయి.

చిక్కడు దొరకడు!




వైపాలెం తహసీల్దార్ కార్యాలయం

పచ్చనోట్లు కనిపిస్తేనే ప్రత్యక్షం

- పొలాన్ని బట్టి రేటు ఫిక్స్
- మధ్యవర్తులతోనే బేరసారాలు
- 4 నెలల్లో 2వేల ఫైళ్లు క్లియర్
- విచారణ లేకుండానే ఆన్‌లైన్
- వైపాలెం తహసీల్దార్ తీరు వివాదాస్పదం


ఎర్రగొండపాలెంలోని 58/1 సర్వే నంబరులో తహసీల్దార్ ఇచ్చిన పొజిషన్‌తో రిజిస్ట్రేషన్ అయిన మాచర్ల-మార్కాపురం రోడ్డులోని స్థలం

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండలంలో రైతులు భూముల ఆన్‌లైన్ కోసం మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తే తహసీల్దార్ కనిపించరు. ఆయన వై.పాలెంలో పూర్తి బాధ్యతలు చూస్తూ పుల్లలచెరువు మండలంలో ఇన్‌చార్జ్‌గా సేవలందిస్తున్నారు. అక్కడి వారు తహసీల్దార్ కోసం వస్తే ఇక్కడ ఉన్నట్లు, ఇక్కడి వారు కార్యాలయానికి వెళ్లే అక్కడ ఉన్నట్లు చెబుతూ చిక్కడు దొరకడు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన విధుల్లో కనిపించక పోయినా ఫైళ్లు మాత్రం పెద్దఎత్తున క్లియర్ అవుతున్నాయి. ఎర్రగొండపాలెం తహసీల్దార్‌గా బాలకిషోర్ విధుల్లో చేరి కేవలం నాలుగు నెలలే అయ్యింది. ఈ కొద్ది కాలంలోనే ఆయన భారీగానే కూడబెట్టుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంతా మధ్యవర్తుల ద్వారానే..

గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి ఎర్రగొండపాలెం తహసీల్దారుగా బాలకిషోర్ విధుల్లో చేరారు. అప్పటి నుంచి కార్యాలయంలో సక్రమంగా అందుబాటులో ఉన్నది లేదు. దీనికి తోడు ఆయనకు ఇటీవల పుల్లలచెరువు తహసీల్దార్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇదే అదనుగా భావించిన ఆయన అక్కడి వారికి ఇక్కడ, ఇక్కడి వారికి అక్కడ ఉన్నానని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా సంప్రదిస్తే పనులు చక్కబెట్టేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌అండ్‌బీ రోడ్డు రాసిచ్చారు..!

నకిలీపత్రాలు సృష్టించి 58/1లో ఈనెల 18న దొడ్డపనేని యోగమ్మ పేరుతో జరిగిన రిజిస్ట్రేషన్ స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో మొత్తం సూత్రధారి తహసీల్దారేనని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సర్వే నెంబరు (58/1) వేసి మాచర్ల-మార్కాపురం రోడ్డుకు అనుసంధానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించిన 201 చదరపు గజాల స్థలాన్ని ఈ నెల 21వ తేదీన దొడ్డపనేని శ్రీనివాసులు భార్య యోగమ్మ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. తహసీల్దార్ క్లియరెన్స్ ఇవ్వడం వల్లే ఇది జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలా ప్రభుత్వ భూములు పరులపరం చేసినవి కోకొల్లలు ఉన్నట్లు చర్చ నడుస్తోంది.

సిబ్బంది ప్రమేయం లేకుండానే ఆన్‌లైన్

ఒక్క వై.పాలెం మండలంలోనే నాలుగు నెలల్లో ఏకంగా 2వేల వరకు ఫైళ్లు ఆన్‌లైన్‌లో క్లియర్ అయినట్లు సమాచారం. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా రెవెన్యూ సిబ్బందితో సంబంధం లేకుండా తహసీల్దారే ఆన్‌లైన్ చేస్తున్నారని సిబ్బందే చర్చించుకోవడం విశేషం.

ఎకరానికో రేటు..

మండలంలో అక్రమ ఆన్‌లైన్ వ్యవహారాలకు మధ్యవర్తుల ద్వారా ఎకరానికి రూ.10వేల వరకు తహసీల్దార్ వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల వెంకటాద్రిపాలెం, ఎర్రగొండపాలెం, కొత్తపల్లి, మిల్లంపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల్లో జరిగిన భూముల ఆన్‌లైన్‌ల విషయంలో సర్వేయర్ల పాత్ర ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

సెలవుపై వెళ్లిన తహసీల్దార్

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ జరిగాయంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడం, పత్రికల్లో వార్తలు రావడంతో తహసీల్దారు ఎ.బాలకిషోర్ సెలవులో వెళ్లిపోయారు. ఈనెల 4వతేదీ వరకూ ఆయన సెలవులో ఉన్నారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలపై ఆయన వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు అందుబాటులోకి రాలేదు.


ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల్లోని పాత్రల నృత్య రూపకం

ముగిసిన నాటకోత్సవాలు

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 16 రోజులపాటు సాగిన ఉత్సవాల్లో కళారూపాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. చివరి రోజు నళినీప్రియ కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాల్లో పోషించిన పాత్రల ప్రదర్శన అలరించింది. శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం కనులవిందు చేసింది.

7

కంభం చెరువు పర్యాటక కేంద్రంగా మారేనా?

- పర్యాటకుల్లో ఆశలు రేపిన ఎంపీ శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారుల ప్రకటనలు
- చెరువు అభివృద్ధికి రూ.9.58 కోట్లతో ప్రతిపాదనలు

7

పాఠశాలల్లో విద్యార్థులకు మానసిక కౌన్సిలర్లు

- తొలి విడత జిల్లాలో ఇద్దరు నియామకం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థుల మానసిక స్థాయిని తెలుసుకొని కెరీర్ గైడెన్స్ ఇచ్చేందుకు ఇద్దరు కౌన్సిలర్లను నియమిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ ద్వారా వీరిని నియమించారు. ప్రతి కౌన్సిలర్‌కు జిల్లాలో 8 మండలాలు, 8 నుంచి 10 సెకండరీ పాఠశాలలను కేటాయిస్తారు. వీరు విద్యార్థుల మానసిక స్థితి తెలుసుకొని మానసిక ఆరోగ్యం, కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్ ఇస్తారు. ప్రవర్తన, భావోద్వేగం, విద్యాపరమైన సవాళ్లను గుర్తించి పరిష్కరిస్తారు. జిల్లాకు ప్రస్తుతం తొలి విడతగా చెరుకూరు పద్మ, కరవది అనిల్‌లను కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లుగా నియమిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు ఇచ్చారు.

లిఫ్ట్‌లో 3 గంటలు

మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నరక యాతన

మెయిన్‌లో..

పేరుకుపోయిన ఇంటి పన్నులు

- జిల్లావ్యాప్తంగా రూ.24.97 కోట్లు పెండింగ్
- వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. 38 మండలాల్లోని 719 గ్రామ పంచాయతీల్లో రూ.24.97కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పంచాయతీల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటం, అభివృద్ధి పనులు చేయాల్సి రావడంతో ప్రస్తుత కూటమి సర్కారు పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. మార్చి ఆఖరు నాటికి నూరుశాతం వసూలుకు ఆదేశించింది. ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటి పన్నుల వసూలుపై మండల, గ్రామస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంకోవైపు జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు కూడా టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహించి పన్ను వసూళ్లపై దిశానిర్దేశం చేశారు.

మార్కాపురం మండలంలో వసూలు శూన్యం

జిల్లాలోని 38 మండలాల్లో కేవలం మూడు మండలాల్లో మాత్రమే గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నూరుశాతం పన్నులు వసూలయ్యాయి. మార్కాపురం మండలంలో ఒక్క పైసా కూడా జమ కాలేదు. అనేక మండలాల్లో కనీస స్థాయిలో కూడా వసూలు చేయలేదు. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమన్న విమర్శలున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నుతోపాటు వివిధ రకాల పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేవిధంగా చూడాల్సి ఉంది ఉంది. కానీ ఆదిశగా వారి నుంచి చర్యలు కరువయ్యాయి. జిల్లాలోని 719 గ్రామ పంచాయతీల్లో పన్ను వసూలు డిమాండ్ రూ.58.58 కోట్లు ఉండగా కేవలం రూ.33.61 కోట్లు (57.38శాతం) మాత్రమే వసూలు చేశారు. రూ.24.97 కోట్లు పెండింగ్‌లో ఉంది.

నూరుశాతం వసూలుకు ఆదేశం

కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. కానీ పంచాయతీల్లో పైసా లేని పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు గ్రామాల అభివృద్ధిని ప్రోత్సహిస్తేనే ఆర్థిక పరిపుష్టి చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పన్ను బకాయిల వసూలుకు ఆదేశించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జిల్లా అధికారులు ఆదేశించినా క్షేత్రస్థాయిలో బాధ్యత కలిగిన సిబ్బంది నుంచి ఆశించిన స్పందన కరువైంది.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

జిల్లా అవతరణ వేడుకల్లో మంత్రి బాలవీరాంజనేయస్వామి

- పారిశ్రామిక ప్రగతికి చర్యలు
- త్వరితగతిన వెలిగొండ పూర్తి
- త్వరలో ప్రకాశంలో కందుకూరు నియోజకవర్గం విలీనం
- ఒంగోలులో విమానాశ్రయం
- ఆక్వా, గ్రానైట్ రంగాలకు ప్రోత్సాహం


ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఆదివారం జరిగిన జిల్లా అవతరణ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కనిగిరిలో నిమ్జ్, దొనకొండ కారిడార్ పూర్తికి సీఎం హామీ ఇచ్చారన్నారు. రామాయపట్నం పోర్టు, హార్టికల్చర్ యూనివర్సిటీ ఉన్న కందుకూరు నియోజకవర్గం త్వరలోనే ప్రకాశంలో విలీనమవుతుందని మంత్రి తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. బేస్తవారపేట నుంచి ఒంగోలుకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను ఈ ఏడాదే ప్రారంభిస్తామని తెలిపారు. జిల్లాలో ఆక్వా, గ్రానైట్ పరిశ్రమల రంగాలను ప్రోత్సహిస్తామన్నారు. ప్రకాశం యూనివర్సిటీ, ఒంగోలు డెయిరీపైనా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారన్నారు. ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటుతోపాటు చిన్న పరిశ్రమలకు చేయూతనిస్తామని మంత్రి స్వామి తెలిపారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విజన్-2047లో రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా ప్రస్తావించిన పది సూత్రాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా వెనుకబాటుతనాన్ని అధిగమించి అభివృద్ధిలో దూసుకుపోయే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతకు ముందు ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళి అర్పించారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వి.విజయకుమార్ పాల్గొన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులతోపాటు వివిధ రంగాలలో ప్రతిభచాటిన పలువురిని సన్మానించారు.

పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు టీడీపీలో చేరిక

మద్దిపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని బీఎన్ కార్యాలయంలో నల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయనకు ఎమ్మెల్యే బీఎన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నల్లూరి వెంకట్రావు, మలసాని వెంకట రమణారావు, మలసాని కోటేశ్వరరావు, నల్లూరి చింపిరయ్య, అశోక్, నల్లూరి శ్రీను, నర్రా శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెటరన్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వెటరన్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఒంగోలు నగరం మంగమూరు రోడ్‌లోని ది లార్డ్‌కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఒక రోజు నిర్వహించిన ఈ పోటీలను అకాడమీ నిర్వాహకులు, గౌరవ అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్స్, సింగిల్స్ విభాగాలలో జిల్లావ్యాప్తంగా సుమారుగా 50 మంది వరకు క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు, రన్నర్స్‌గా నిలిచిన వారికి ఆయన మెమెంటో, ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ పి.విజయకృష్ణతోపాటు పీడీబీఏ సభ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ స్థలంపై వివాదం

కొనుగోలు చేశానని నిర్మాణాలను ప్రారంభించిన మహిళ ● నిబంధనలను ఉల్లఘించడంతో నిర్మాణాన్ని కూల్చి వేసిన అధికారులు
నిరాహార దీక్షకు దిగిన వైనం ● సొమ్మసిల్లడంతో ఆస్పత్రికి తరలింపు

సింగరాయకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేవదాయ స్థలంలో మరోసారి వివాదం చోటు చేసుకుంది. దాన్ని కోనుగోలు చేశామని, అందుకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని ఓ మహిళ నిర్మాణాలు చేపట్టగా, రోడ్డు స్థలాన్ని ఆక్రమించిందని కొంతమంది స్థానికులు తెల్లవారుజామున ఘర్షణకు దిగి నిర్మాణాన్ని పాక్షికంగా పగలకొట్టారు. సింగరాయకొండ ప్రధాన రహదారి పక్కన 605-ఏ సర్వే నెంబర్‌లో పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన 3 సెంట్ల స్థలం ఉంది. దాన్ని సింగరాయకొండకు చెందిన ఓ మహిళ ఒక వ్యక్తి వద్ద కొనుగోలు చేసింది. అందులో నెల రోజుల క్రితం నుంచి రేకుల తో గదుల నిర్మాణానికి ఉపక్రమించారు. అప్పటి నుంచి తరచూ స్థానికులు కొంతమంది రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని ఆమెతో ఘర్షణకు దిగుతున్నారు. ఈ తరుణంలో ఆదివారం తెల్లవారుజామున కొంత మంది వ్యక్తులు గడ్డపలుగులతో నిర్మాణాన్ని ధ్వంసం చేశారు.

రూ.50లక్షలు పెట్టి కోనుగోలు చేశా...


రేకులషెడ్‌ను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్


సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

రూ.50 లక్షలకు తాను స్థలం కొనుగోలు చేశానని, కొంత మంది వ్యక్తులు కావాలనే దారి ఆక్రమించానని తరచూ తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. నిర్మాణం చేస్తున్న గదులను రాత్రికిరాత్రికే కొంతమంది రౌడీ మూకలు ధ్వంసం చేశారని బోరున విలపించింది. సమస్యను పోలీసులు, అధికారులు తనకు ఎటువంటి న్యాయం చేయట్లేదని కావున తను చనిపోవడానికి అనుమతిని ఇవ్వాలని విలపించింది. అనంతరం నిరాహార దీక్షకు దిగింది. అక్కడే నీరసించి పడిపోవడంతో స్థానికులు 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు.

ఉత్తర్వులు ఉల్లఘించినందునే..

ఆ స్థలం వివాదంలో ఉన్నందున ఇరువర్గాల వారికి గత నెల 21వ తేదీన తహసీల్దార్ రవి ఎవరూ అందులో ప్రవేశించొద్దని, నిర్మాణం చేపట్టవద్దని నోటీసులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను ఉల్లఘించి నిర్మాణాలు చేపడుతున్నందున ఆదివారం సాయంత్రం రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై మాట్లాడే అర్హత ఎక్కడిది?

● బూచేపల్లిపై జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ ధ్వజం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం ఒంగోలులోని రవిప్రియా మాల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి పరిపాలన చేతకాక ఇష్టానురీతిగా వ్యవహరించడంతో ప్రజలు చీత్కరించి ఇంటికి పంపారనే విషయాన్ని శివప్రసాద్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఆయన ఎద్దేవా


సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్, పక్కన రవిశంకర్

చేశారు. కేసులకు భయపడి కేంద్రాన్ని నిధులు అడిగేందుకు, ప్రాజెక్టుల కేటాయింపులు అడిగేందుకు భయపడిన వ్యక్తులు వైసీపీ నేతలన్నారు. జగన్మోహన్‌రెడ్డి రూ.3వేల పింఛను చేసేందుకు ఐదేళ్ళు పట్టిందని, ఎన్‌డీఏ కూటమి చెప్పినట్లుగా ఏడు నెలల్లో అనేక పథకాలను అమలు చేసిందని తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను కూటమి చేసిన పవన్‌కళ్యాణ్ చేసిన కృషి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. ప్రజల డబ్బులతో వేతనాలు తీసుకుంటున్న శివప్రసాద్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్ళి ప్రజా సమస్యలు చర్చించాలని, లేకపోతే తన పదవి నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జనసేన పార్టీ నాయకుడు కంది రవి శంకర్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేసేటప్పుడు స్థాయిని మర్చి మాట్లాడటం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారంలో ఉందంటే దానికి కారణం పవన్‌కళ్యాణ్ అని దేశ ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్రసాద్, కాసాని వాసు, తిరుమలశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ బాలఉగ్రకు నివాళి

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన కానిస్టేబుల్ బాలఉగ్రకు ఎస్పీ దామోదర్ పోలీస్‌శాఖ తరు పున నివాళి అర్పించారు. దొనకొండ పోలీస్‌స్టేషన్‌లో పనిచే చేస్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు మృతి చెందిన కానిస్టేబుల్ బాలఉగ్ర(34) ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సంతాపం వ్యక్తం చేశారు. బాలఉగ్ర కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుం దని, వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని ఆయన తెలిపారు.

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌లో వెనుకబడిన ప్రకాశం జిల్లాకు మొండి చెయ్యి చూపించారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కాలం సుబ్బారావు ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఆదివారం ఒంగోలు నగరం అద్దంకిబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడే విధంగా లేదని చెప్పారు. కొద్దిమంది ఉద్యోగులకు ఇన్‌కం ట్యాక్స్‌లు మినహాయింపు కోట్లాది మంది ప్రజలపై భారాలు మోపేలా చేశారని ఆరోపించారు. రాష్ట్ర విభజన హామీలను విస్మరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసులు, బీ వీ.రావు, కె.శ్రీనివాసరావు, టి.మహేష్, ఎస్‌డీ.హుస్సేన్, కె.శ్యాం సుందర్, పి.సుబ్బారావు, డి.ఆనంద్, ఎండీ.బేగ్ పాల్గొన్నారు.

హైస్కూలు ప్లస్‌లను మరింత బలోపేతం చేయాలి : ఆపస్


మాట్లాడుతున్న ప్రచారక్ భరత్‌జీ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో తెస్తున్న మార్పుల్లో భాగంగా 11, 12 తరగతులు బోధించే హైస్కూలు ప్లస్ ను రద్దు చేయకుండా మరింత బలోపేతం చేయాలని ఆపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సీహెచ్.శ్రావణ్‌కుమార్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్)ఆవిర్భావ దినోత్సవం, వసంత పంచమి వేడుకలు ఆదివారం ఒంగోలులో జరిగాయాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కె.మల్లికార్జునరావు మాట్లాడుతూ అపస్ గత 43 సంవత్సరాలుగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటు పడటంతో పాటు విద్యార్థుల దేశభక్తి, జాతీయ భావన పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్‌జీకి ఆపస్ డైరీని అందజేశారు. హైస్కూళ్ళలో ప్లస్ తరగతులు కొనసాగించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్లస్‌టు ఉపాధ్యాయులు ఆపస్ నాయకులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.లక్ష్మీనారాయణ, కె.నరసింహం, కేవీ.శేషారావు, వై.వెంకట్రావు, మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిల కోసం పోరుబాట : యూటీఎఫ్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా యుల ఆర్థిక బకాయిలు చెల్లింపులో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త పోరుబాట నిర్వహిస్తామని యూటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు దాటినా బకాయిల చెల్లింపు, పీఆర్సీ ఊసేలేదన్నారు. గత ప్రభుత్వకాలంలో డీఏ, సరెండర్ లలీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 117 జీవో ఉపసంహరణ అనంతరం ఏ ఒక్క పాఠశాల మూతపడకుండా చూడాలన్నారు. విద్యావ్యవస్థను గాడిలో పెడుతామన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీని స్వాగతిస్తున్నామని తెలిపారు. మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, అన్ని పాఠశాలలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సోషలిస్టు విధానమే ప్రపంచానికి మార్గం

మద్దిపాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాజకీయ పార్టీలు కొన్ని కుటుంబాలకు మాత్రమే పరిమితమయ్యాయని ప్రజల పక్షాన ప్రజల సమస్యలపై పోరాడే వ్యక్తులు కరువయ్యారని కమ్యూనిజం మాస పత్రిక సంపాదకుడు ఎంసీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడు బస్టాండ్ సెంటర్ దగ్గర సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా మద్దిపాడులో కార్యదర్శి టీవీ.శేషయ్య ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు రెండు కుటుంబాల మధ్యనే కొనసాగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నల్లజర్ల శ్రీనివాసరావు, గోగినేని వెంకటేశ్వరరావు, పావులూరు అంజయ్య, నాతాని కోటిలింగం, ఎద్దు రవి, కోటిరెడ్డి, పాతపాటి శ్రీను, బొమ్మలు గోపి, నాగండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

● మంత్రి స్వామి

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనాథలను చేరదీస్తూ నిత్యం వందలాది మందికి అన్నదానం చేస్తున్న శివం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తి దాయకమని పలువురు అతిథులు సత్కరించారు. జిల్లా 56వ అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రగతి భవనంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరిని రాష్ట్ర మంత్రి స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయనను ఘనంగా సత్కరించారు. శ్రీహరి చేస్తున్న సేవలకు వారు అభినందనలు తెలిపారు.

బీజేఎంసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖలీఫాతుల్లాబాషా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనుబంధ సంఘమైన భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఒంగోలుకు చెందిన షేక్ ఖలీఫాతుల్లా బాషాను నియమిస్తూ జాతీయ సెల్ అధ్యక్షుడు అర్నబ్ చట్టర్జీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని కార్మికులకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డ, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐ మానవతాదృక్పథం


క్షతగాత్రుడిని రిమ్స్‌లో చేర్పిస్తున్న ఎస్‌ఐ అజయ్‌బాబు

సంతనూతలపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని ఎస్‌ఐ వి.అజయ్‌బాబు స్వయంగా ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ఒంగోలు నగరం ఎస్‌జీవోకాలనీకి చెందిన గోళ్ల ఏడుకొండలు సంతనూతలపాడులోని తన స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని ఎండ్లూరు డొంకసమీపంలోని ట్రిపుల్‌ఐటీ కాలేజీ వద్ద వాహనం అదుపుతప్పి తీవ్రగాయాలతో కిందపడి అపస్మారకస్థితికి లోకి వెళ్లాడు. అనంతరం పక్కనే ఉన్న కొందరు స్థానికులు 108వాహనానికి ఫోన్ చేశారు. అదేసమయంలో ఎస్‌ఐ అజయ్‌బాబుకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన ప్రాంతానికి చేరుకున్న ఎస్‌ఐ, అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో హుటాహుటిన తన పోలీస్ జీబులో ఏడుకొండలును రిమ్స్‌లో చేర్పించారు. దీంతో స్థానికులు ఎస్‌ఐ మానవతాదృక్పథంతో వ్యవహరించడంపై ప్రశంసిస్తున్నారు.

పేస్‌లో ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైన జేఎన్‌టీయూ కాకినాడ అంతర్ కళాశాలల బాల్‌బ్యాట్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. పురుషుల విభాగంలో గుడ్లవల్లేరు ఎస్‌ఆర్‌జీసీ కళాశాల జట్టు ప్రథమస్థానం, మైలవరం ఎల్‌బీఆర్‌సీఈ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాల, గుంటూరు చలపతి ఇంజనీరింగ్ కళాశాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ఇక మహిళల విభాగంలో గుడ్లవల్లేరు ఎస్‌ఆర్ జీఈసీ కళాశాల పట్టు ప్రథమ, నూజివీడు ఎస్ఎస్‌ఐఈటీ కళాశాల జట్టు ద్వితీయ, ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, గుంటూరు సెయింట్స్ మేరీ కళాశాల జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు పేస్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ ట్రోఫీలను అందజేశారు. జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల సెక్రటరీ జీవీ.రాజు, సెలక్షన్ కమిటీ సభ్యులు శివశంకర్, రాజేంద్రబాబు, హేమ వెంకటలక్ష్మిలు యూనివర్శిటీ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్, సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, రూపఅక్షేష్, మధుసూదనరావు, రాజు విజేతలను అభినందించారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశంపంతులు చిత్రపటానికి ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రకాశంపంతులు చేసిన సేవలు అనిర్వచనీయమని, యువత ఆయన ఆదర్శాలతో ముందుకు వెళ్ళాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు రాఘవేంద్రరావు, శ్రీకాంత్‌బాబు, నాగరాజు, అజయ్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

నివాళులర్పించిన కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్: జిల్లా 56వ అవతరణ దినోత్సవం పుర స్కరించుకుని స్థానిక మినీ స్టేడియం వద్ద ప్రకాశంపంతులు విగ్రహానికి కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ఈదర చిన్నారి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



బహుమతిని అందజేస్తున్న నాగసత్యలత, అనిషాలక్ష్మి

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి2(ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత కోరారు. ఏడుగుండ్లపాడులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో రెండు రోజుల నుంచి జరుగుతున్న కళాశాల వార్షికోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన నాగసత్యలత మాట్లాడుతూ శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో డీజే ట్రస్ట్ ద్వారా 100మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కరస్పాండెంట్ గోరంట్ల కవితను అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నాగసత్యలత, కుమార్తె అనిషాలక్ష్మి నగదు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కరస్పాండెంట్ కవిత, డీన్ దాది ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నారాయణరావు, ఏఓ శ్రీనివాస్, రమేష్, రవిచంద్ర పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

పొన్నలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జ నసేన కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్తరాసుపాలెం గ్రామంలో ఆ దివారం ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నె రవేరుస్తూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నదన్నారు.

7న 'లక్ష డప్పులు.. వేల గొంతులు'


ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నేతృత్వంలో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమానికి మాదిగ సోదరులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించకుండా ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని అన్నారు. వర్గీకరణ సాధన కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధి బాబు, నాయకులు రమేష్, రాజబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: ఈనెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు.. వేలగొంతుల కార్యక్రమం పోస్టర్‌ను సంతనూతలపాడులో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీను, జీవరత్నం అశోక్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం చెరువు పర్యాటక కేంద్రంగా మారేనా?


కంభం చెరువులో ఉన్న కొండలు

మంచి భోజన ప్రియుడిని 'నీది కడుపా.. కంభం చెరువా' అని పెద్దలు కాస్త ముద్దుగా, కాస్త వెటకారంగా అంటుంటారు.. కంభం చెరువు మీద సామెత పుట్టిందంటే దాని విస్తీర్ణం ఏపాటిదో అర్థమవుతోంది.

ఆసియా ఖండంలోని రెండో అతి పెద్దచెరువు.. శ్రీకృష్ణదేవరాయుల భార్య వరదరాజమ్మ(శచీదేవి) సూచనతో కంభం చెరువును నిర్మించారు.

సూర్యాస్తమయం వేళ మరింత ఆహ్లాదకరంగా వాతావరణం.. స్వచ్ఛమైన గాలి.. విశాలమైన చెరువు.. చుట్టూనే కాదు మధ్యలో కూడా అక్కడక్కడా ఎత్తైన కొండలు.. వాటిపై పచ్చని తివాచీలు పరిచినట్లు చెట్లు.. ఇలా కంభం చెరువు ఎన్నో విశేషాలు, వింతలను సొంతం చేసుకుంది.


సాయం సంధ్యవేళలో సుందరంగా కంభం చెరువు

కంభం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కంభం చెరువును ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు. 2003లోనే రాష్ట్ర పర్యాటకశాఖ కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలని నిర్ణయించింది. ఆ నిర్ణయం నేటికీ కలగానే మిగిలింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం జిల్లాలో పలు చారిత్రాత్మక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే తలంపుతో ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే మూడు రోజులక్రితం ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సీఎం చంద్రబాబును కలిసి కంభం చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, చెరువులోపల ఉన్న 8 కొండలకు శ్రీకృష్ణదేవరాయుల కొలువులో ఉన్న అష్టదిగ్గజాల కవుల పేర్లు పెట్టాలని కోరడం, దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంపై ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సైతం చెరువు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- పర్యాటకులలో ఆశలు రేపిన ఎంపీ శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారుల మాటలు
- చెరువు అభివృద్ధికి రూ.9.58 కోట్లతో ప్రతిపాదనలు

చెరువు అభివృద్ధికి రూ.9.58 కోట్లతో ప్రతిపాదనలు

ఇరిగేషన్ ఏఈ శ్రీనునాయక్

కంభం చెరువు అభివృద్ధి పనులకు రూ.9.58 కోట్ల నిధులతో ప్రభుత్వానికి నివేదికలు పంపాం. మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకటత్రివినాథ్ సూచన మేరకు ప్రతిపాదనలు తయారు చేశాం. కట్టపై రిసార్ట్ కట్టేందుకు రూ.3.92 కోట్లు, పర్యాటకులకు టాయిలెట్ల సౌకర్యానికి రూ.7.85 లక్షలు, కట్టపై గ్రీనరీ గార్డెన్ నిర్మాణానికి కోటి రూపాయలు, 15 తాత్కాలిక చప్టాల నిర్మాణానికి రూ.1.20 కోట్లు, చెరువులో బోటింగ్‌కు రూ.85లక్షలు, డిస్‌ప్లే నేమ్ బోర్డు(లైటింగ్‌కు) రూ.10లక్షలు, జీఎస్‌టీ, కంటైనర్ చార్జీలకు రూ.1.66 కోట్లు, ఇరిగేషన్ పనులకు రూ.67.50 లక్షలతో ప్రతిపాదనలు పంపాం.




చెరువుకట్టపై శ్రీకృష్ణదేవరాయలు, శచీదేవి విగ్రహాలు

కంభం చెరువు విశేషాలివీ..

- 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల సతీమణి వరదరాజమ్మ(శచీదేవి) ఈ ప్రాంత ప్రజలు కరువుతో పడుతున్న బాధలు గమనించి ఒక విశాలమైన కట్టను నిర్మింపచేశారు.
- నల్లమల అడవుల నుంచి ప్రవహించే గుండ్లకమ్మ, జంపలేరు వాగుల నుంచి నీరు కంభం చెరువుకు చేరుతుంది.
- చెరువు లోపల విస్తీర్ణం 5వేల హెక్టార్లలో విస్తరించి ఉంది.
- చెరువు ఆధారంగా అధికారికంగా 6,340 ఎకరాలు, అనధికారికంగా 4వేల ఎకరాల ఆయకట్టులో వివిధ పంటలు సాగవుతుంటాయి.
- 1984లో రెండుసార్లు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కంభం చెరువును చూసి చల్లని వాతావరణంలో సూర్యాస్తమయం అద్భుతం, అపూర్వం, ఇలాంటి చెరువును తానెక్కడా చూడలేదని కితాబిచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రులు, మరెందరో ఈ చెరువును చూసి మంత్రముగ్ధులయ్యారు.
- వినాయకచవితి, గరికతొక్కుడు(తేరాతేజీ) పండుగల్లో వేలాది మంది ప్రజలు చెరువుకట్టపైకి వస్తుంటారు.
- ఈ చెరువుకు వెలిగొండ ప్రాజెక్టు పథకం ద్వారా శాశ్వత సాగునీటి పారుదల ఉండేలా పనులు జరుగుతున్నాయి.

డ్రోన్ల ద్వారా చెరువు పరిశీలన

కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2016 ఆగస్టులో ఉన్నతాధికారులు డ్రోన్ కెమెరాల ద్వారా చెరువును పరిశీలించారు. కట్టపై నుంచి చెరువు వైశాల్యాన్ని అప్పటిరాజుల పనితనాన్ని చూసి ఆశ్చర్య పోయారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఆదాయవనరుగా మారుతుందని భావించారు.

సముద్ర తాబేళ్ల మనుగడకు ఆటంకం కలిగించొద్దు


ఏటిమొగ తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ఏకే నాయక్

చినగంజాం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : సముద్ర తాబేళ్ల మనుగడకు ఆటంకం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏకే నాయక్ ఆదేశించారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏటిమొగ గ్రామంలో రాష్ట్ర అటవీ శాఖ ట్రీ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల సముద్ర ప్రాంతంలో తాబేళ్లు మృతి చెంది తీరానికి వచ్చిన వాటి గురించి ఆయన విచారణ చేపట్టారు. ఏటిమొగ సముద్ర తీరంలో ఆయన తాబేళ్ల మృతి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరబోట్లు 8కిలోమీటర్లపైనే మాత్రమే సముద్రంలో వేట చేయాలన్నారు. 8కిలోమీటర్లలోపు వేట చేసి తాబేళ్ల మనుగడకు భంగం కలిగిస్తే ఆ బోట్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాబేళ్ల రక్షణ గురించి ఏపీ కోస్టు గార్డు, మెరైన్, మత్స్య శాఖల సహకారం తీసుకొని ఉమ్మడిగా పనిచేయాలని అటవీ శాఖాధికారులకు సూచించారు. మత్స్యకారులు టేకువల, నానా జాతి వలలు వాడితే వారి మీద కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటా జనవరి నుంచి మే వరకు తీరానికి వచ్చి గుడ్లు పెట్టే ఆలివ్ రెడ్లీ తాబేళ్లను సంరక్షించే బాధ్యత ఆయా శాఖలతో పాటు మత్స్యకార గ్రామాలన్నిటిపై ఉందన్నారు. కొత్తపట్నం మండలం పిన్నివారిపాలెంలోని హేచరీని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. కార్యక్రమంలో బాపట్ల, ప్రకాశం జిల్లాల అటవీ శాఖాధికారులు ఎల్.భీమయ్య, కె.వినోద్‌కుమార్, రేంజర్ బి.నరసింహారావు, సెక్షన్ అధికారి కె.మోహన్, ఎఫ్‌బీవోలు శశిభూషణ్, బాషా, నాగమణి, ఐటీసీ ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సూరజ్ ప్రధాన్, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల రక్షణ దళ సభ్యులు అర్జునరావు, వరుణ్, వాయిల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు పీపీగా గొట్టిపాటి బాధ్యతలు


శ్రీనివాసరావు

అద్దంకి, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అద్దంకికి చెందిన న్యాయవాది గొట్టిపాటి శ్రీనివాసరావు సోమవారం ఒంగోలులో బాధ్యతలు స్వీకరించనున్నారు. బల్లికురవ మండలం కొండాయపాలెంకు చెందిన గొట్టిపాటి శ్రీనివాసరావు న్యాయవాదిగా అద్దంకిలో స్థిరపడ్డారు. గతంలో అద్దంకి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా పనిచేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వం నియమించటంతో సోమవారం ఒంగోలులో శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్‌గా మధుసూదన్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్‌గా పిన్నిక మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక రెవెన్యూభవన్‌లో ఆదివారం జరిగిన అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశానికి అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుతం రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఉన్న మధుసూదన్‌రావును జేఏసీ అమరావతి భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు జేఏసీ జిల్లా చైర్మన్‌గా ఎన్నుకుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ కందుల వెంకటేశ్వర్లు, అమరావతి జేఏసీ మహిళా చైర్‌పర్సన్ ఎన్.విజయలక్ష్మి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయకుమార్, రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వాసుదేవరావు, కోశాధికారి ఊతకోలు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు ఇంద్రగంటి ఆంజనేయులు, అనపర్తి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ మధుసూదన్‌ను సత్కరిస్తున్న నాయకులు


కళలను ప్రోత్సహించటమే ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
-అప్పాజోస్యుల సత్యనారాయణకు ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారం
-అలరించిన శ్రీనివాస కల్యాణం
-ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు


సత్యనారాయణకు పురస్కారం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్, హరిబాబు

ఒంగోలు కల్చరల్ , ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కళలను ప్రోత్సహించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఆదివారం రాత్రి స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో దామచర్ల మాట్లాడుతూ కళలు, కళాకారులకు తనవంతు ప్రోత్సాహాన్ని అందజేస్తానని, ఇంత ఘనంగా కళాపరిషత్ నిర్వహించటం అభినందనీయమని అన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ మాట్లాడుతూ కళలు మనుగడ సాగించాలంటే దాతలు, కళాకారులతో పాటు ప్రేక్షకుల ప్రోత్సాహం అవసరమని అన్నారు. రాష్ట్రపోలీస్ హౌసింగ్ చైర్మన్ ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మన కళలు పదికాలాలపాటు వర్ధిల్లాలంటే నేటియువతకు మాతృభాషపై మమకారాన్ని పెంచాలన్నారు.ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల సాంబశివరావు, పాటిబండ్ల ఆనందరావు పాల్గొన్నారు.


అల్లూరి సీతారామరాజు నాటికలో దృశ్యం

అప్పాజోస్యులకు ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారం

అపా విభో ఫౌండేషన్ అధ్యక్షులు ప్రముఖ కవి అప్పాజోస్యుల సత్యనారాయణను ఈ సంవత్సరం ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. విదేశాలలో ఉద్యోగాన్ని నిర్వహించినప్పటికీ తెలుగు రాష్ట్రాలలో కళలు ముఖ్యంగా సాహిత్యం, నాటకం వంటి వాటికి అప్పాజోస్యుల సత్యనారాయణ ఎనలేని సేవ చేశారని ఈ సందర్భంగా అతిధులు కొనియాడారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం

శ్రీనివాస కల్యాణం నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుని ప్రదర్శనలను ప్రేక్షకుల ముందు సాక్షాత్కరింపజేశారు. అదేవిధంగా నాదస్వర బృంద కచ్చేరి, కోలాట ప్రదర్శన సైతం ఆకట్టుకున్నాయి. ఆదివారంతో ఉత్సవాలు ముగిశాయి.

పద్యం తెలుగువాడి ఆత్మ

● అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్


గ్రంథాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, సత్యనారాయణ, రవికృష్ణ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పద్యం తెలుగువాడి ఆత్మ అని అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. ప్రముఖ కవి డీవీఎం సత్యనారాయణ రచించిన శ్రీకృష్ణలీలాంరిఛోళి గ్రంథావిష్కరణ సభ ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళామిత్ర మండలి, వీవీఐటీ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మానవుని సన్మార్గంలో నడిపించేందుకు భక్తి ఉపయోగపడుతుందన్నారు. గుంటూరు వీవీఐటీ ప్రతినిధి మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ పక్షాన ఒక గొప్ప పుస్తకాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పుస్తకాన్ని సమీక్షించారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ సత్యనారాయణ రచించిన పద్యకావ్యం సాహితీలోకానికి మకుటాయమానం అన్నారు. కార్యక్రమానికి కళామిత్ర మండలి అధ్యక్షుడు నూనె అంకమ్మరావు అధ్యక్షతన జరిగిన సభలో వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, అన్నాపంతుల జగన్నాథరావు, సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్‌బాబు, గాడేపల్లి దివాకరదత్తు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. తన పుస్తకాన్ని ముద్రించి ఆవిష్కరించిన సంస్థల ప్రతినిధులకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : చదలవాడ రెవెన్యూ పరిధిలోని గుండ్లకమ్మనదీ పరివాహక ప్రాంతంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టారు. రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌తో లారీల్లోకి ఇసుకను నింపి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. 216 జాతీయ రహదారిని ఆనుకొని చదలవాడ మద్దిరాలపాడు గ్రామాల మధ్య గుండ్లకమ్మ నదికి ఉత్తరం వైపుభాగంలో నున్న జామాయిల్ తోట పక్కనున్న స్థలం తమదేనంటూ కొందరు వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపట్టారు. 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేశారు సాధారణంగా వాల్టా చట్టం ప్రకారం బ్రిడ్జికి సుమారు 500 మీటర్లు దూరం అవతల మాత్రమే తవ్వకాలు చేయాలి. కానీ ఆ నిబంధనలేమీ పాటించడంలేదు. ఇసుక తవ్వకాలపై తహసీల్దారు కె.ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇసుక తవ్వకాలు, తరలింపు విషయం తన దృష్టికి రాలేదన్నారు. నదిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని, అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.


గుండ్లకమ్మ నదిలో ఎక్స్‌కవేటర్‌తో సాగిస్తున్న ఇసుక తవ్వకాలు

జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో వాడరేవు విద్యార్థుల సత్తా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


షీల్డ్‌ను అందుకుంటున్న విజేతలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో చీరాల మండలం వాడరేవుకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. దీటుగా ప్రత్యర్థి టీంపై పోరాడి ప్రథమ స్థానాన్ని సాధించారు. అండర్ 14, 17 విభాగంలో రాణించి బహుమతి అందుకున్నారు. త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో పలువురు చీరాల వాడరేవు ప్రాంతాల ప్రజలు విజేతలను అభినందించారు.

మృతురాలు ఒంగోలు వాసి

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గత గురువారం వేటపాలెంలో రైలు ఢీకొట్టి మృతి చెందిన వృద్ధురాలిని ఒంగోలు వాసిగా చీరాల రైల్వే పోలీసులు గుర్తించారు. ఒంగోలు బస్టాండ్ ప్రాంతానికి చెందిన జగన్నాథం రమణమ్మ(75)కి ఇద్దరు కుమారులు. వేటపాలెంలో బంధువులు ఉండడంతో గత గురువారం వేటపాలెంకు ఆమె వచ్చారు. రాత్రి సమయంలో తిరిగి వెళ్లేందుకు వేటపాలెం రైల్వేస్టేషన్‌లో ఒంగోలు రైళ్ల ఆగేవైపు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టి మృతి చెందింది. రైల్వే పోలీసులు మృతురాలి వివరాలు గుర్తించారు. ఆదివారం చీరాల వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్రైం సమాచారం

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


ప్రమాదంలో మృతి చెందిన గుమ్మా శ్రీను

త్రిపురాంతకం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని లేళ్లపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన గుమ్మా శ్రీను తన పొలం పనుల కోసం బంధువుల నుంచి ట్రాక్టరు తెచ్చుకున్నాడు. పని పూర్తి చేసుకుని తిరిగి ఇచ్చేందుకు పుల్లలచెరువు మండలం కుందంపల్లికి వెళుతున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టరు నడుపుతున్న శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శివబసవరాజు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి


బాలఉగ్ర (ఫైల్)

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన కానిస్టేబుల్ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. గిద్దలూరు పట్టణానికి చెందిన సింగంశెట్టి బాలఉగ్ర (38) దొనకొండలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధులలో భాగంగా గత నెల 19న దొనకొండ నుండి గుంటూరుకు కారులో వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలయ్యాయి. గుంటూరులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పట్టణంలోని రాచర్ల రోడ్డులో నివాసం ఉంటున్న బాలఉగ్ర గిద్దలూరు సర్కిల్ పరిధిలో కూడా కానిస్టేబుల్‌గా పని చేశాడు.

కుక్కల దాడిలో గొర్రెలు, పొట్టేళ్లు మృతి


మృతిచెందిన గొర్రెలు, పొట్టేళ్లు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో గొర్రెలు, పొట్టేళ్లు మృతిచెందిన ఘటన గిద్దలూరు మండలం తాళ్లపల్లిలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన చిన్న తిరుమలయ్యకు సంబంధించిన 24 గొర్రెలు, పొట్టేళ్లు ఉండగా, ఆయన వాటిని కలందొడ్డిలో ఉంచాడు. శని వారం రాత్రి ఇంటికి వెళ్లి భోజనం చేసి వచ్చేసరికి వీధికుక్కలు పొట్టేళ్లు, గొర్రెలపై దాడి చేసి వాటిని చంపాయి. గొర్రెలు, పొట్టేళ్లు మేపి జీవనం సాగిస్తున్న చిన్నతిరుమలయ్య వాటి మృతితో ఆవేదన చెందుతున్నాడు. వీటి విలువ 2లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


మృతిచెందిన యువకుడు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి). గూడ్స్ రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసు కున్న ఘటన ఆదివారం రాత్రి మార్కాపురం రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకొంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల వైపు నుంచి గుంటూరు వైపు రైలు వెళుతోంది. మార్కాపురం రైల్వే స్టేషన్ వద్దకు గూడ్స్ రైలు వచ్చింది. ఆ సమయంలో టికెట్ బుకింగ్ కౌంటర్ కార్యా లయం ఎదురుగా యువకుడు ఒక్కసారిగా పట్టాలపైకి దూకి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. యువకుడు ఎరుపు రంగు టీషర్టు, నీలి రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ

కార్పెంటర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ కార్పెంటర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఆకుమళ్ల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్పెంటర్స్ యూనియన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతినెల ఒకటో తేదీ కార్పెంటర్లకు సెలవు ఉంటుందన్నారు. ఆరోజు ఎవరూ కూడా కార్పెంటర్ పనులు చేయరాదన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని కార్పెంటర్లు, టింబర్ డిపో యజమానులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ మెరుగు



ప్రథమ స్థానం పొందిన ఆకూరపాడు పాఠశాల జట్టు

మార్కాపురం వన్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలలో పాల్గొనడం ద్వారా ప్రతిభ మరింత మెరుగ పడి మేథస్సు పెంపొందించుకోవచ్చని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు, గణితం, సైన్సు అంశాలలో ఆదివారం పోటీలు నిర్వహిం చారు. 26 జట్లు పాల్గొనగా వారందరికీ రాత పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన మొదటి 7 జట్లకు ముఖాముఖి 4 రౌండ్లగా నిర్వహించారు. ఈ పోటీలలో టంగుటూరు మండలం ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.వెంకట భార్గవి, సీహెచ్ అమర్‌నాథ్, వై.నిహారిక, ఎం.హరిప్రియల జట్టు జిల్లా ప్రథమస్థానం సాధించి రూ.7వేల నగదు బహుమతి పొందింది. పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్ఎండీ మాజ్, ఎన్.నిశాంత్, వి.నాగవంశీ మాధవ్, ఎస్ఎండీ రిహాన్‌ల జట్టు ద్వితీయ బహుమతి రూ.5వేల నగదు అందుకున్నారు. మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పీవీవీఎన్ రాకేష్, బీఎస్ఎస్ ప్రసాద్, ఎం.భాను సాకేత్, ఎ.మోహిత్ పణీంద్రల జట్టు తృతీయ బహుమతి రూ.3వేలు అందుకొంది. కార్యక్రమంలో శ్రీ ఫ్రెండ్స్ సభ్యులు దూదేకుల నబీ, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, సుగ్గం శివప్రసాద్, వై.శ్రీనివాసులు, పి.కనకదుర్గ, బి.కృష్ణవేణి, ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సుందరయ్య కాలనీ

- 16 ఏళ్లయినా పూర్తికాని ఇళ్ల నిర్మాణాలు
- బేస్‌మెంట్ స్థాయిలోనే గృహాలు
- నేటికీ మౌలిక వసతులు కరువు


తుమ్మచెట్లు పెరిగి అసంపూర్తిగా ఉన్న కాలనీ

కంభం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని రావిపాడుకు వెళ్లే రోడ్డుపక్కన ఉన్న సుందరయ్యకాలనీ 16 సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉంది. ఈ కాలనీలో బేస్‌మెంట్ స్థాయిలోనే పలు నిర్మాణాలు నిలిచిపోయాయి. 2008-09లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పక్కాగృహాల పేరుతో ఇళ్లనిర్మాణం ప్రారంభించింది. దాదాపు 16 ఏళ్లు గడిచినా కాలనీ నిర్మాణాలు పూర్తికాక సమస్యల నడుమ ఆయా కుటుంబాలు జీవనం వెళ్లదీస్తున్నాయి.

2006-07 నుంచి మూడు విడతలుగా ఇందిరమ్మ గృహాలు, రచ్చబండ పథకం ద్వారా జీవో నెంబరు 171 ద్వారా ఈ కాలనీలో 330 పక్కాగృహాలు మంజూరయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం ఇక్కడి లబ్ధిదారుల్లో 80 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, వివిధ నిర్మాణ దశల్లో అసంపూర్తిగా వదిలివేశారు. ఈ సంఖ్య ఇంకా ఎక్కువ గానే ఉంటుందని ఇక్కడ పరిస్థితిని బట్టి తెలుస్తోంది. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కొన్ని గృహాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఆ తరువాత ప్రభుత్వం మారడం, కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ చేపట్టడంతో మరికొంత జాప్యం ఏర్పడింది. దీంతో నాటి నుంచి నేటి వరకు నిర్మాణాలు పూర్తి కాలేదు. మరో వైపు ఈ స్థలంలో కొంత భాగంపై ఓ వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ భూమిలో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అప్పటి నుంచి అధికారులు దీనిపై ఎటూ తేల్చకోవడంతో లబ్ధిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే లబ్ధిపొందినట్లు ప్రభుత్వ రికార్డుల్లో వీరి పేర్లు ఉండడంతో మరోసారి కొత్తగా ఇళ్లు కూడా మంజూరు కావడం లేదు. దీంతో ఈ లబ్ధిదారులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఉంది.

ప్రస్తుతం లబ్ధి పెంచడంతో మళ్లీ ఆశలు

అయితే ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అదనపు సహాయం కింద రూ.25వేలు నగదును ప్రకటించింది. దీంతో 80 గృహాల లబ్ధిదా రులు ఈ అదనపు సహాయానికి అర్హులుగా గుర్తించి ఇళ్లు పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. అయితే కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే లబ్ధిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. కనీసం ఆ దిశగానైనా అధికారులు చొరవ చూపాల్సి ఉంది.

ఇవీ కాలనీలో సమస్యలు

కాలనీలో విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలు వేసినా వాటికి తీగలు బిగించలేదు. వేసిన ఒక్క బోరు ఎండిపోయింది. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి.

ఈవిషయమై హౌసింగ్ ఏఈ వంశీకృష్ణ స్పందిస్తూ, 330 మందికి గృహాలు మంజూరైనా 83 మంది మాత్రమే రూ.25 వేల పెంపునకు అర్హత సాధించారు. వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకోవచ్చు.

వేసవికి ముందే తాగునీటి కష్టాలు ప్రారంభం

పంచాయతీ కార్యాలయం ఎదుట మహిళల నిరసన



పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే ఫిబ్రవరి నెల మొదలైందో లేదో, తాగునీటి కష్టాలు ప్రారంభం అయ్యాయి. తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలు కాలనీల మహిళలు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని ఎన్టీఆర్ కాలనీ, పాత బలపాల ఫ్యాక్టరీ సమీపంలో సుమారు 100 కుటుంబాల వారు నిరసనలో పాల్గొన్నారు. వారికి గత నెల రోజులుగా బోరు నుండి వచ్చే నీటి దార తగ్గిందని నీటిసమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయిన పంచాయితీ అధికారులు కానీ, నాయకులు కానీ పట్టించుకోలేదని వారు పేర్కొన్నారు. దీంతో నీటి సమస్య తీర్చాలని కోరుతూ కార్యాలయం ముట్టడికి వచ్చినట్లు తెలిపారు. అయితే వారు వచ్చిన సమయంలో ఆదివారం కావడంతో అధికారులు, నాయకులు అందుబాటులో లేరు. కార్యదర్శితో సిబ్బంది మాట్లాడగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపినట్లు వారు తెలిపారు. ఏది ఏమైన వేసవికాలం రాకముందే నీటి ఎద్దడి పెరుగుతుందని ముందోస్తు జగ్రత్తలు తీసుకోని నీటి ఎద్దడి లేకుండా చూడాలని పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి

జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్


ఎస్పీ దామోదర్‌కు డ్రోన్‌ను అందజేస్తున్న శ్రీనివాసులు

కంభం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలు అదుపు చేసేందుకు దాతలు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను పోలీసులకు బహూకరించి సహరించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. సాధారణ తనిఖీలలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన కంభం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ కేతం శ్రీనివాసులు రూ.1.60లక్షల విలువైన డ్రోన్ కెమెరాను కంభం పోలీసుస్టేషకు బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జరిగే నేరాల అదుపు చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. దొంగతనం, ఇతర నేరాలు చేసే వారి కదలికలను గమనించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరంచాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలు చేసే వారిని గుర్తించి అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు డ్రోన్‌కెమెరాను బహూకరించినందుకు ఆయనను అభినందించారు. కంభం పట్టణంలో జాతీయ రహదారి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. అంతకుముందుగా ఆయన పోలీసుస్టేషన్ పరిసరాలను, సిబ్బంది క్వార్టర్స్‌ను, మహిళ పోలీసుస్టేషన్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు, కంభం సీఐ మల్లికార్జునరావు, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్య, కంభం ఎస్సై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పింఛన్ సొమ్ము పంపిణీ

మున్సిపల్ అధికారులకు నగదు అప్పగించిన ఎమినిటీస్ సెక్రటరీ వెంకటేశ్వర్లు


లబ్ధిదారులకు సొమ్ము అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మార్కాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు శనివారం ఫించన్ పంపిణీ చేయకుండా వెళ్లిపోయిన 18వ సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ పాలడుగు వెంకటేశ్వర్లు ఎట్టకేలకు ఆదివారం నగదు తీసుకుని వచ్చి మున్సిపల్ అధికారులకు అప్పజెప్పారు. దీంతో 18వ సచివాలయం పరిధిలోని ఒంటెద్దు బండి కాలనీలోని 61 మంది లబ్ధిదారులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు రూ.2.66 లక్షల ఫించన్ సొమ్మును పంపిణీ చేశారు. ఈ నెల 1వ తేదీన ఫించన్ చేయాల్సిన ఎమినిటీస్ సెక్రటరీ వెంకటేశ్వర్లు అధికారులకు సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయాడు. సాయంత్రమైన ఫించన్ సొమ్ము పంచకుండా, అధికారులకు ఇవ్వకుండా ఉండడంతో కమిషనర్ డీవీఎస్ నారాయణరావు టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన టౌన్ ఎస్సై సైదుబాబు విచారణ ప్రారంభించి వెంకటేశ్వర్లు ఆచూకీ కనుగొన్నాడు. పింఛన్ సొమ్ము రూ.2.66 లక్షలను ఆదివారం ఉదయం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయాన్ని కమిషనర్ నారాయణరావుకు తెలియజేశారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారి ఆదేశాల మేరకు వెంటనే లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు కౌన్సిలర్లు నాలి కొండయ్య, షేక్ చిన్నషెక్షావలిలు పాల్గొన్నారు.

ప్రాణకోటి మనుగడకు చిత్తడి నేలలు అవసరం


బహుమతులు అందుకుంటున్న ఛాత్రులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భూమిపై ప్రాణకోటి మనుగడకు చిత్తడి నేలలు అవసరమని ప్రకాశం జిల్లా నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ ఎం.సజీవరాజు అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎన్‌జీసీ డైరెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సజీవరాజు మాట్లాడుతూ నీటి వనరులకు మంచినీటికి మూలాలుగా ఉన్న చిత్తడి నేలలు భూమి ఉపరితలం నుంచి వ్యర్థాలను వడపోస్తాయన్నారు. మార్కాపురం క్లస్టర్ కోఆర్డినేటర్ వొద్దుల రవిశేఖర్ మాట్లాడుతూ..నీటి సరస్సులు, ఉప్పు నీటి సరస్సులు, మడ అడవులు ఉన్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలు అంటారన్నారు. వీటి నాణ్యతను పెంచడం ద్వారా కాలుష్య కారకాలను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై మాట్లాడే అర్హత ఎక్కడిది?

- బూచేపల్లిపై జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్, పక్కన రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రశ్నించారు. ఆది వారం సాయంత్రం ఒంగోలులోని రవిప్రియా మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి పరిపాలన చేతకాక ఇష్టానురీతిగా వ్యవహరించడంతో ప్రజలు చీత్కరించి ఇంటికి పంపారనే విషయాన్ని శివప్రసాద్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. కేసులకు భయపడి కేంద్రాన్ని నిధులు అడిగేందుకు, ప్రాజెక్టుల కేటాయింపులు అడిగేందుకు భయపడిన వ్యక్తులు వైసీపీ నేతలన్నారు. జగన్మోహన్‌రెడ్డి రూ.3వేల పింఛను చేసేందుకు ఐదేళ్ల పట్టిందని, ఎన్‌డీఏ కూటమి చెప్పినట్లుగా ఏడు నెలల్లో అనేక పథకాలను అమలు చేసిందని తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను కూటమి చేసిన పవన్‌కళ్యాణ్ చేసిన కృషి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. ప్రజల డబ్బులతో వేతనాలు తీసుకుంటున్న శివప్రసాద్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలు చర్చించాలని, లేకపోతే తన పదవి నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జనసేన పార్టీ నాయకుడు కంది రవి శంకర్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేసేటప్పుడు స్థాయిని మర్చి మాట్లాడటం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారంలో ఉందంటే దానికి కారణం పవ న్‌కళ్యాణ్ అని దేశ ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం ప్ర సాద్, కాసాని వాసు, తిరుమలశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుపోరు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు, వైసీపీ నాయకులు

మార్కాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఈ నెల 5న వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫీజుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆవిష్కరించారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఫీజుపోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నాయకులు మీర్జా షంషీర్ అలీబేగ్, నల్లబోతుల కొండయ్య, చెంచిరెడ్డి, తిరుపతిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, మంగమూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫీజు పోరును విజయవంతం చేయాలి

గిద్దలూరు : ఒంగోలులో ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కె.పి.నాగార్జునరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత నాలుగు త్రైమాసికాలుగా బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన కింద చెల్లించాల్సిన రూ.3,900 కోట్లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. కావున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజు పోరు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

మామిడితోటల పరిశీలన

గిద్దలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర్‌నగర్ గ్రామపరిధిలో సాగైన మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారి విష్ణుప్రియ పరిశీలించారు. ప్రస్తుతం మామిడి పూత, పిందె దశలో ఉందని, మొగ్గపెరిగే దశలో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను, 1.25 గ్రాముల బోరాన్‌ను కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కాయలు నిమ్మ కాయ పరిమాణంలో ఉన్నపుడే 1శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ లీటరు నీటిలో 10 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. పూత, పిందె రాలకుండా ఉండాలంటే ప్లానోఫిక్స్ మందును పిచికారి చేయాలన్నారు. పూతలో తామర పురుగు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తామర పురుగు నివారణకు అలాగే సూక్ష్మపోషకాల నివారణకు కూడా తగు నివారణ మందులు పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

ఘనంగా వసంత పంచమి


సరస్వతీదేవి అలంకరణలో కోట సత్యమాంబ

కంభం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా కంభంలోని కోటా సత్యమాంబదేవి సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఆదివారం సత్యమాంబదేవి ఆలయానికి మూడు మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఆదివారం వసంత పంచమి కూడా రావడంతో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి బోనాలతో భారీగా తరలివచ్చిన మహిళ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 10గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులకు అవకాశం కల్పించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర


ప్రత్యేక అలంకరణ పోలేరమ్మ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 2 ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పేస్‌లో ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజ నీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైన జేఎన్‌టీయూ కాకినాడ అం తర్ కళాశాలల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. పురుష ల విభాగంలో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీసీ కళాశాల జట్టు ప్రథమస్థానం, మైలవరం ఎల్‌బీఆర్‌సీఈ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాల, గుంటూరు చలపతి ఇంజనీరింగ్ కళాశాల జట్లు తృ తీయ స్థానంలో నిలిచాయి. ఇక మహిళల విభాగంలో గుడ్లవల్లేరు ఎస్ఆర్ జీఈసీ కళాశాల జట్టు ప్రథమ, నూజివీడు ఎస్ఎన్ఐఈటీ కళాశాల జట్టు ద్వితీయ, ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, గుంటూరు సెయిం ట్స్ మేరీ కళాశాల జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. విజేతలకు పేస్ ఇం జనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ ట్రోఫీ లను అందజేశారు. జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల సెక్రటరీ జీవీ.రాజు, సెలక్షన్ కమిటీ సభ్యులు శివశంకర్, రాజేంద్రబాబు, హేమ వెంకటలక్ష్మిలు యూనివర్శిటీ పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, మద్దిశెట్టి కళ్యాణ్, సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, రూపఅక్కేష్, మధుసూదనరావు, రాజు విజేతలను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమం

పొన్నలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జ నసేన కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని జనసేన కొండపి నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్తరాసుపాలెం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ, రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్నదన్నారు.

అవీ..ఇవీ



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ గఫార్

ప్రకాశం పంతులు ఆశయాలను కొనసాగించాలి

● మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను నేటి యువత కొనసాగించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మూడు జిల్లాలకు దూరంగా ఉన్న ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేశారన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రకాశం పంతులు చేసిన త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీనివాసులరెడ్డి, మురళీకృష్ణ, కాలేశా, కరీం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

విభజన హామీల అమలులో విఫలం

పామూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులకు నిరసనగా స్థానిక మమ్మిడాడీ సెంటర్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. షేక్ అల్లభక్ష్, వై. వీరనారాయణ, తవ్వ శ్రీనివాసులు, కే శంకర్, షేక్ మహబూబ్‌పీరా, ఎం. విఠల్‌రావు, షేక్ ఇస్మాయిల్, సీహెచ్ వెంకటేశ్వర్లు, సయ్యద్ గౌస్‌బాష, పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తాళ్లూరు,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుంటిగంగ సన్నిధిలోని గుంటిగంగా భవానీకి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని పూజించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. వాహనదారులు వాహన పూజలు చేయించారు. ఆలయ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికిపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్‌పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు

ముండ్లమూరు : మండలంలోని ముండ్లమూరు, పోలవరం, శంకరాపురం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, పసుపుగల్లులో పోలేరమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పోలేరమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు) : సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు. అనంతరం స్వామివార్లకు మహానైవేద్యాన్ని సమర్పించారు. గోశాలలోని గోవులకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



విజ్ఞాన యాత్రకు తరలివెళ్తున్న గౌతమీ కాలేజీ విద్యార్థులు

విజ్ఞానం పెంపొందేందుకు యాత్రలు

దొనకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విజ్ఞానయాత్రలు ఎంతో దోహదపడతాయని గౌతమీ డిగ్రీ కాలేజీ అడ్మిన్ ఎఫ్రాయిమ్(నాని) వివరించారు. గౌతమీ కళాశాలల చైర్మన్ గుండారెడ్డి ఆదేశాల మేరకు కాలేజీకి చెందిన విద్యార్థులను శ్రీశైలం విజ్ఞానయాత్రకు ఆదివారం తీసుకెళ్లారు. శ్రీశైలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పాతాళగంగ, శివాజీకోట, పవర్‌ప్లాంట్, రుద్రపార్క్ తదితర ప్రదేశాలను విద్యార్థులకు చూపించి వాటి ప్రాముఖ్యతలను వివరిస్తామన్నారు. ఈ విజ్ఞానయాత్రకు విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు ఎస్. వెంకటేశ్వరరెడ్డి, దేవదానం, డి. వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిగా కోటపాటి



కోటపాటి జనార్దనరావు

పామూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వినుకొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా పామూరుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు నియమితులయ్యారు. తనపై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా నియమించడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మిర్చి రైతుకు నష్టాల ఘాటు

ఆశలు తారుమారు

దిగజారిన ధరలు

క్వింటా రూ.12వేలకు పడిపోయిన రేటు

గత ఏడాది రూ. 21వేలు పలికిన వైనం

ఆందోళనలో సాగుదారులు



కల్లాల్లో ఎండబెట్టిన మిరప కాయలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి సాగు చేసిన రైతుల ఆశలు తారు మారయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో కలసి మండలంలో 2,680 ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. తోటలు సాగు చేసిన దగ్గర నుంచి కాపు దశకు వచ్చే వరకు రకాల రకాల తెగుళ్లతో పైరు ఎదుగుదల లేక రైతులు అల్లాడి పోయారు. అనేక మందులు వాడినా ఏ మాత్రం అందుపులోకి రాలేదు. దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. గత ఏడాది క్వింటా దిగుబడి తేజా రకం రూ. 19వేలు నుంచి రూ. 22వేల ధర పలికింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించి అదనంగా మిర్చి సాగు చేశారు. తీరా ఈ ఏడాది తోటల్లో నుంచి దిగుబడి వచ్చి ఆ మిర్చి కాయలను కల్లాల్లో ఎండబెట్టి అమ్ముకునే తరుణంలో ఒక్కసారిగా ధరలు పడి పోయాయి. క్వింటా ప్రస్తుతం తేజా రకం రూ. 10వేల నుంచి రూ. 12వేలు నడుస్తుండగా మిగతా రకాలైన 341, బంగారపు తీగ, బాడుగ రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు మాత్రమే దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక తాలుకాయాలు మాత్రం రూ. 4వేలు నుంచి రూ.5వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరానికి పెట్టుబడి మాత్రం లక్ష నుంచి రూ. 1.20 లక్షలు అవుతోంది. ఈ ఏడాది ఎకరా మిర్చి కూలీలు కోయటానికి క్వింటాకు 15 మంది కావాల్సి ఉండగా వారికి ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున రూ. 7,500 కూలి అవుతోంది. దీంతో దిగుబడి అంతంత మాత్రంగా ఉండటం, కూలి, కోత ఖర్చులు పెరిగి పోవటంతో మిర్చి సాగు రైతులు నష్టాలు మూట గట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతుల పరిస్థితి ఐతే మరింత దయనీయంగా ఉంది. మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, నాయుడుపాలెం, తమ్మలూరు, సుంకరవారిపాలెం, నూజెండ్లపల్లి, పసుపుగల్లు, ముండ్లమూరు, చంద్రగిరి, పోలవరం, ఈదర, జమ్మలమడక, మారెళ్ళ, భట్లపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో అధికంగా మిర్చి సాగు చేశారు. నెల రోజుల నుంచి ముమ్మరంగా మిర్చి కోతలు కోసి ఎక్కువ మంది రైతులు అమ్మకాలు చేస్తున్నారు. దళారులు రైతుల అవసరతను ఆసగాగా తీసుకొని తక్కువ ధరకే మిర్చి కొనుగోలు చేస్తున్నారు. అదేమంటే ఇతర దేశాలకు ఎగుమతి లేదని వంక చూపి రైతులను నిలువునా మోసం చేస్తున్నారు.



కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కోత కూలి కూడా వచ్చే పరిస్థితి లేదు



ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. ఎకరాకు లక్ష రూపాయల చొప్పున రూ. 5 లక్షలు పెట్టుబడి పెట్టాను. తీరా దిగుబడి చూస్తే గుండెలు బాదుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లి తెగులు, తామర, బొబ్బర తెగులుతో దిగుబడి తగ్గి పోయింది. అరకొరగా వచ్చిన దిగుబడిని అమ్ముకోవటానికి మార్కెట్‌కు వెళితే తొమ్మిది నుంచి రూ. 10వేలకు క్వింటా ధర పలకటం చూస్తే ఏంచేయాల్లో పాలుపోవడం లేదు.

- కాసా అంజిరెడ్డి, మిర్చి రైతు, తమ్మలూరు

ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితి



ఈ ఏడాది మిర్చి సాగు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దిగుబడి పాతాళానికి పడి పోయింది. ఖర్చులు ఎక్కువయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ. 10వేలు మాత్రమే పలుకుతుంది. ఇలాగైతే పంటకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావటం లేదు. పైసా కూడా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

- చిమ్మిలి రామకృష్ణ, మిర్చి రైతు, వేమలబండ

శ్యామల కాశిరెడ్డి సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



ప్రతిభా పరీక్షల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి శ్యామల కాశిరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. వెలిగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరీక్షల ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది ఫైనల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతిభా పరీక్షలు ఎంతో దోహద పడతాయన్నారు. పార్యాంశాల్లో మరింత పట్టు పెంచుకునేందుకు విద్యార్థులకు తగిన అవగాహన లభిస్తుందన్నారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో దిక్సూచి లా శ్యామల కాశిరెడ్డి ఈ ప్రాంత విద్యార్థుల విద్యోన్నతికి బాటలు వేసేలా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహించటం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం పోటీ పరీక్షల్లో పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం శ్యామల కాశిరెడ్డిని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, శ్రీనివాసాచారి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఖాజా హుస్సేన్, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు ఇంద్రభూపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

ప్రతిభా పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వెలిగండ్ల హైస్కూల్ విద్యార్థిని రాయల జాహ్నవికి ప్రథమ బహుమతి కింద రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా కనిగిరి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఎం. ఆనంద్‌కు రూ.15వేలు, తృతీయ బహుమతిని వెలిగండ్ల హైస్కూల్‌కు చెందిన బిందుప్రియ రూ.10 వేలు, నాల్గవ బహుమతి కింద కే రోహిత్‌కు రూ.7వేలు, ఐదవ బహుమతిని కనిగిరి మండలం కంచర్లవారిపల్లి హైస్కూల్‌కు చెందిన నందిని రూ.5వేలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, శ్యామల కాశిరెడ్డిలు అందించారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

● ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

● వెలిగండ్ల మండలంలోని గన్నవరం బ్రిడ్జి పనుల పరిశీలన

కనిగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం గన్నవరం బ్రిడ్జి పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టరుతో నిర్మాణ పనుల్లో జరుగుతున్న నాణ్యతా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ తరాల ప్రజలకు గుర్తుండి పోయేలా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు మేలు చేకూర్చటమే లక్ష్యమన్నారు. అందులో భాగంగా ఒక్కొక్కటిగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. మురుగుతో పాట్లు

ఇళ్ల మధ్యలో నిలిచిన నీటితో దుర్గంధం

విషజ్వరాలు ప్రబలుతాయని స్థానికుల ఆందోళన





నేతాజీనగర్‌లో ఖాళీగా ఉన్న ఇంటి స్థలంలో నిలిచి ఉన్న మురుగు నీరు (ఇన్‌సెట్లో) ఎన్జీవో కాలనీలోని ప్లాట్‌లో ఆకుపచ్చరంగులోకి మారిన నీరు

పామూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్జీవో కాలనీ, నేతాజీనగర్, నెల్లూరు రోడ్డులోని శ్రీనివాసనగర్, అంకాలమ్మవీధి, ఎర్రచేలు, ఉర్దూ పాఠశాల ఏరియా తదితర ప్రాంతాల్లో ఇళ్లమధ్య ఖాళీగా ఉన్న ప్లాట్లలో మురుగునీరు నిలిచిపోయింది. చుట్టూ ఉన్న ఇళ్ల వారు ఖాళీ ప్రాంతాలను డంపింగ్‌యార్డులుగా వినియోగించుకుంటున్నారు. పైగా వారు వాడిన నీటిని ఖాళీ ప్రదేశాల్లోకి వదిలివేస్తున్నారు. దీంతో మురుగునీరు నిలిచిపోయి రంగుమారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా ప్రమాదకరమైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు తమ ప్లాట్లను మెరక చేసుకోవాలని పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా కొందరు స్పందించడం లేదని సిబ్బంది వాపోతున్నారు.



కురిచేడు ప్రాంతంలో రహదారిని కమ్మేసిన పొగమంచు



మంచులోనే మిరపకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



తాళ్లూరులో ఆదివారం ఉదయం 9గంటల సమయంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

మంచు దుప్పటి

కురిచేడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కురిచేడును శనివారం ఉదయం మంచు దట్టంగా కమ్ముకుంది. రోడ్డు మీద ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైతం కనపడనంత స్థాయిలో మంచు కురిసింది. హైదరాబాద్ నుంచి వచ్చే బస్సులు ఒకదాని వెంబటి ఒకటి వరుసగా వచ్చాయి. వాహనాలు లైట్లు వేసుకుని మరీ ప్రయాణించాయి. సాగర్ కాలువ మీద మంచు కమ్ముకోవడంతో చూడముచ్చటగా ఉంది. కురిచేడులోని మార్కెట్ యార్డులో కూలీలు పొద్దునే వచ్చి మంచులోనే మిర్చిలో గ్రేడింగ్ చేస్తూ కనిపించారు. చలిని, మంచును సైతం లెక్క చేయకుండా రైతు కూలీలు పనులకు వెళ్లారు.

తాళ్లూరును కమ్మేసిన మంచు

తాళ్లూరు, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలుగ్రామాల్లో రెండు రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఆదివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి చిరుజల్లులు కురిసినట్లుగా పొగ మంచు కురిసింది. ఉదయం 9గంటల వరకు దట్టంగా కురవటంతో రహదారులు తడిసి పోయాయి. మంచువల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు పూర్తిగా సమీపానికి వచ్చేవరకు కన్పించక పోవటంతో వాహనచోదకులు భయభయంగా ప్రయాణం సాగించారు. దీనితోడు చలి తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం

దర్శి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత కల్పించి అధిక నిధులు కేటాయించారని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ కూటమిపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాలకు అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, విశాఖ ఉక్కు అభివృద్ధికి, అమరావతి రాజధానికి నిధులు కేటాయించారన్నారు. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీ ఎం పవన్‌కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో దేశం, రాష్ట్రం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగి అదృశ్యం

● భార్య ఫిర్యాదుతో కేసు నమోదు



ఉద్యోగి వరప్రసాద్ (ఫైల్)

దొనకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీవీఎన్ వరప్రసాద్ గత ఏడాది అక్టోబరు నుంచి కనబడకుండా పోవటంతో భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రంగనాయకులు తెలిపిన వివరాల మేరకు పి. వెంకట నర్సింహ వరప్రసాద్ దొనకొండ ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కుటుంబం నివసించే పుల్లల చెరువుకు వెళ్లి వస్తుంటాడు. అక్టోబరు 1వ తేదీన దొనకొండ ఎంపీడీవో కార్యాలయం నుంచి ముండ్లమూరు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు దొనకొండ ఎంపీడీవో కార్యాలయం నుంచి రిలీవ్ అయ్యాడేకాని ముండ్లమూరు కార్యాలయంలో నేటికీ జాయిన్ కాలేదు. నాటి నుంచి భార్య, కుటుంబ సభ్యులు అన్నీ ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా అతని జాడ కనిపించక పోవటంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు తెలిపారు.

క్రైం సమాచారం

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్ అంకారావు

ముండ్లమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన పెద్దేటి శేషయ్య(58) ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈఘటన శనివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన శేషయ్య పెద ఉల్లగల్లు ఉంచి నడుచుకుంటూ ఎస్సీ కాలనీలోకి వెళ్తుండగా తాళ్ళూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహన చోదకుడు దర్శి వైపు నుంచి వస్తూ శేషయ్యను ఢీకొట్టాడు. దీంతో శేషయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాసర్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ అంకారావు తెలిపారు. మృతదేహానికి ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చికిత్సపొందుతూ కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ బాలఉగ్ర (ఫైల్)

దొనకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ సింగంశెట్టి బాలఉగ్ర (35) ఆదివారం ఉదయం మృతిచెందాడు. గతనెల 19వ తేదీన కారు డ్రైవింగ్ చేస్తూ గుంటూరు సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బాలఉగ్ర గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న త్రిపురాంతకం సీఐ హస్సాన్, పోలీస్ సిబ్బంది గుంటూరు వైద్యశాలకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. మృతదేహాన్ని స్వగ్రామమైన కొమరోలు మండలం పుల్లారెడ్డిపల్లికి తరలించే ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మృతిచెందిన కానిస్టేబుల్ బాలఉగ్రకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన పెద్దలక్ష్మమ్మ

కురిచేడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని పొట్లపాడులో ఆదివారం జరిగింది. త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి గ్రామంకు చెందిన దద్దాల యోగయ్య భార్యతో కలిసి కురిచేడు మండలం పొట్లపాడు గ్రామంలోని యోగయ్యస్వామి దేవాలయానికి మొక్కు తీర్చుకునేందు కు వెళ్తున్నారు. కురిచేడు-పొట్లపాడు రోడ్డులోని నాగార్జునసాగర్ కాలువ వద్ద మూలమలుపులో రైతులు పంటపొలాలకు ఏర్పాటు చేసిన నీటి పైపులపై మట్టి ఎత్తుగా వేయటంతో అది గమనించని యోగయ్య ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో యోగయ్య భార్య పెద్దలక్ష్మమ్మకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు 108కు సమాచారం తెలపగా కురిచేడు 108 అంబులెన్స్ ఈఎంటీ మహబూబ్‌బాష, పైలెట్ వెంకటప్పయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని పెద్దలక్ష్మమ్మకు ప్రథమ చికిత్స చేసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.





అరచేతిలో.. పాలన

- వాట్సాప్ గవర్నెన్స్‌లో 520 రకాల సేవలు
- ధ్రువపత్రాలు మొదలు.. ఫిర్యాదుల వరకూ
- అన్నీ అందుబాటులోకి
- తొలి విడతగా 161 రకాల సేవలు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వానికి మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నంలో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోంది. ఆధునిక యుగపు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గతంలో ఈ- గవర్నెన్స్ పేరుతో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేసిన ప్రభుత్వం ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్‌కు తెరతీసింది. రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కృతమైన 'వాట్సాప్ గవర్నెన్స్' ఇప్పటి వరకూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న ఆ కాస్త దూరాన్ని కూడా చెరిపేసింది. 'మన మిత్ర- ప్రజల చేతిలో ప్రభుత్వం' పేరుతో మంత్రి లోకేశ్ గురువారం ఉండవల్లిలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించారు. దాని ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందించబోతున్నారు. దీంతో ఇప్పటి వరకూ సచివాలయాలకు వెళ్లాల్సినంత దూరంలో ఉన్న సేవలు ఇప్పుడు అరచేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోనులోకే వచ్చేశాయి. సేవలతోపాటు సమస్యలపై ఫిర్యాదులు చేసుకునే అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

● 520 రకాల సేవలు

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మొత్తం 520 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. అందులో భాగంగా తొలి విడతగా 161 రకాల పౌరసేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రెండో విడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపింది. తొలి విడతలో దేవదాయ, ఇంధన, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్, సీఎంఆర్ఎఫ్, వైద్య ఆరోగ్య, పోలీసు, సీడీఎంఏ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలయ్యాయి. ఉదాహరణకు దేవదాయ శాఖకు సంబంధించిన వివిధ ఆలయాల్లోని సేవలు, టికెట్ల బుకింగ్, ఆర్టీసీ రిజర్వేషన్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు, పాత కనెక్షన్ మార్పు ఇలా అనేక రకాల సేవలు వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పర్యాటక సేవల్లో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సప్‌లో పంపిస్తారు. కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని టికెట్లు, వసతి సహా అన్నీ పొందవచ్చు. రెవెన్యూ విభాగం ద్వారా మనకు కావాల్సిన ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నో ఎర్నింగ్.. ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు, ట్రేడ్ లైసెన్సులు, రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు. వాట్సప్ ద్వారా పొందవచ్చు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు. ఆస్తి పన్నుల వంటివి ఈ అధికారిక వాట్సాప్ ద్వారా చెల్లించవచ్చు. ఏపీఎస్ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ రిమైండర్, ట్రాకింగ్ సర్వీసు, సర్వీసు, రిఫండ్, ఫీడ్‌బ్యాక్ తదితరాలు దీని ద్వారా పొందవచ్చు.



వాట్సాప్ గవర్నెన్స్‌లో పలు శాఖలకు చెందిన సేవల ఎంపికలు

95523 00009 ఈ ఒక్క వాట్సాప్ నెంబరుతో పాలన

వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 95523 00009 నెంబరును కేటాయించింది. ఈ నెంబరును మొబైల్‌లో యాడ్ చేసుకోవాలి. ప్రజలు వారికి కావాల్సిన సేవలు పొందడానికి, ఏవైనా ఫిర్యాదులు ఉంటే తెలియజేయడానికి ఆ నెంబరులో మెసేజ్ చేయాలి. తొలిగా మెసేజ్ బాక్సులో హాయ్ అని మెసేజ్ టైప్ చేసి సెండ్ చేయాలి. వెంటనే సేవను ఎంచుకోండి అనే మెసేజ్ ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే.. ఒక మెనూ వస్తుంది. ఆ మెనూలో మనకు కావాల్సిన విభాగాన్ని ఎంచుకుని మనం కావాల్సిన సేవలను ఎంచుకోవాల్సి ఉంటుంది. అవి సంబంధిత శాఖ అధికారుల లాగిన్లోకి వెళతాయి. వాటి ఆధారంగా అధికారులు పరిష్కారం, సేవలు అందిస్తారు.

● తగ్గనున్న ప్రయాస..

ఏదైనా ప్రభుత్వ సేవలు కావాలంటే ఆ కార్యాలయాల చుట్టూ ఒకటికి పదిసార్లు తిరగాల్సిన దుస్థితి నెలకొని ఉంది. వాట్సాప్ గవర్నెన్స్ ఈ పద్ధతికి చెక్ పెట్టనుంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకనున్నారు. ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని పౌరులకు చేరవే యాలంటే ఈ వాట్సాప్ ఖాతా ద్వారా సందేశాలు పంపిస్తుంది. ఒకేసారి కోట్ల మందికి ఈ సమాచారం చేరుతుంది. వరదలు, వర్షాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, వైద్యఆరోగ్య, వ్యవసాయ, అత్యవసర, పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధి సమాచారం వంటివి అందిస్తారు.

● ఫిర్యాదులు.. వినతుల ట్రాకింగ్..

ప్రజలు వినతులు, ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే.. ప్రభుత్వం ఇచ్చిన వాట్సాప్ నెంబర్‌కు మెసేజ్ చేస్తే వెంటనే ఒక లింక్ వస్తుంది. అందులో పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితరాలు పొందుపరిచి, వారి వినతిని టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నెంబరు వస్తుంది. దాని ఆధారంగా తమ వినతి పరిష్కారం ఎంత వరకూ వచ్చింది? ఎవరి వద్ద ఉంది అనేది పౌరులు ఎప్పటి కప్పుడు తెలుసుకోవచ్చు. ఎలాంటి సమస్యనైనా ఇక్కడ విన్నవించొచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్హతలు, ఆయా పథకాల ద్వారా కలిగే లబ్ధి తదితర అంశాలన్నింటి గురించి ఈ వాట్సాప్ నంబరుకు మెసేజ్ చేసి తెలుసుకోవచ్చు.

శివ..శివా..!

- కోటప్పకొండ తిరునాళ్లపై చిన్నచూపు
- పేరుకే రాష్ట్ర పండుగ హోదా
- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం
- ఎనిమిదేళ్లుగా నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- విరాళాలతో నెట్టుకొస్తున్న వైనం


ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహా శివరాత్రి పర్వదినాన జరిగే కోటయ్య తిరునాళ్లకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. తిరునాళ్ల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ నెల 26న తిరునాళ్ల జరగనున్నది. ఇక గడువు 23 రోజులే ఉంది. అయితే ఏర్పాట్లకు ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించినా ఏడేళ్లుగా రూపాయి కూడా విడుదల చేయకపోవడం గమనార్హం. భక్తుల విరాళాలతోనే తిరునాళ్ల ఏర్పాట్లను నెట్టుకు వస్తున్నారు.

(కోటప్పకొండ(నరసరావుపేట), ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ తిరునాళ్లు సమీపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భక్తులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయడం అధికారులకు తలకుమించిన భారమవుతోంది. రాష్ట్ర పండుగ హోదా కల్పించిన సమయంలో, ఏటా తిరునాళ్లకు రూ.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నదే తప్ప విడుదల చేయడం లేదు. ఇప్పటికి రూ.2.10 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఇలా ఉంటే ఈ ఏడాది తిరునాళ్లకు కనీసం రూ.30 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ప్రభుత్వానికి లేఖ రాశారు. అలాగే నిధుల విడుదలకు సంబంధించి దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసి కోరారు. అయితే ఇంతవరకు ప్రభుత్వం నుంచి నిధుల విషయం తేలలేదు. ఏటా తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల సమస్యను అధికారులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీలకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. రాష్ట్ర పండుగ హోదా కల్పించినా తిరునాళ్ల నిధులపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో ఆయా శాఖల అధికారులు ఏర్పాట్ల కోసం నిధులు సమకూర్చు కోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమావేశాల్లో నిధుల సమస్యలను సంబంధిత అధికారులు ప్రస్తావించినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సమయం తక్కువగా ఉండటంతో ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభిస్తేనే సకాలంలో పూర్తయ్యే అవకాశం ఉంటుంది. పోలీసు, దేవదాయ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యం, అటవీ, రెవెన్యూ తదితర శాఖలు తిరునాళ్ల ఏర్పాట్లలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. తాగునీరు, పారిశుధ్యం, యాత్రికుల భద్రత పై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. కొండ దిగువన, కొండ ఎగువన కోటయ్యస్వామి సన్నిధిన విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. లక్షలాది మంది భక్తులు స్వామిని సులువుగా దర్శించుకునేందుకు పటిష్టమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొండకు వేలాది వాహనాలు తరలివస్తాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెట్లూరివారిపాలెం, అవిశాయపాలెం రహదారుల్లో వాహనాల రాకపోకలు ఉంటాయి. ఈ రహదారులకు అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ జామ్ అవ్వడం ఆనవాయితీగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫల మవుతున్నారు. దీంతో తిరునాళ్లకు వచ్చే వెళ్ళే యాత్రికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాల్సి ఉండగా ఇందుకోసం జరుగుతున్న ప్రయత్నాలు లేవు. ఆర్టీసీ వీఐపీల కోసం ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నది. ఇందుకు సంబంధించి రూ.లక్షల్లో ఆర్టీసీకి బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వీఐపీల కోసం ఉచిత బస్సు సౌకర్యాన్ని ఈ ఏడాది రద్దు చేశారు. బందోబస్తు విధుల్లో దాదాపు రెండు వేల మంది పోలీసులు పాల్గొంటారు. వీరందరికి రెండు రోజులు భోజన వసతి కల్పించాలి. ఇందుకు ఖర్చు భారీగానే ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం నుంచి నిధులు లేవు. భక్తుల విరాళాలతోనే పోలీసులకు భోజన వసతిని కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది.

కోటప్పకొండ సోపాన మార్గంపై నిర్లక్ష్యం

కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం సోపాన మార్గం నిర్వహణపై నిర్లక్ష్యం తాండవిస్తున్నది. మెట్లపై దేవస్థానానికి వెళ్ళే భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. కనీసం తాగునీటి వసతి కూడా లేదు. సోపాన మార్గంలోని మెట్లు చాలా చోట్ల పగిలిపోయాయి. రాళ్ళు బయటపడ్డాయి. మెట్లపై వ్యర్థాలు పేరుకుపోయాయి. తిరునాళ్ల రోజున సోపాన మార్గం గుండా వేలాది మంది భక్తులు దేవస్థానానికి వెళతారు. పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించి సోపాన మార్గాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు మెట్లకు మరమ్మతులు చేసే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.


పేరుకుపోయిన వ్యర్థాలు.. మట్టి.. రాళ్లు

పాడి రైతులకు.. పరిహారం

పశునష్టంపై నాలుగేళ్ల నిరీక్షణకు తెర

- నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 2,500 మందికి లబ్ధి
- తొలివిడతలో లబ్ధిదారుల ఖాతాలకు రూ.6.20 కోట్లు జమ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పాడి రైతులను గత ప్రభుత్వం మోసం చేస్తే కూటమి ప్రభుత్వం పరిహారం అందచేసి ఆదుకుంటోంది. ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే పరిహారం ఇస్తామని ఊరించి నాలుగేళ్లు ఉసూరుమనిపించగా.. అందుకు సంబంధించిన నిధులను కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఖాతాల్లో సొమ్ములు జమ కావడంతో పాడిరైతుల నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడింది. పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే వాటి పోషకులకు సాయం చేస్తామని 2019లో పశునష్ట పరిహార పథకానికి వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పశువులకు కేటాయించిన ట్యాగ్ ఆధారంగా ఉచిత బీమా అమలు చేస్తామని కూడా నమ్మించింది. అయితే ఆర్భాటంగా ఆయా పథకాలను ప్రకటించారే కాని అమలు చేయడంలో నాటి పాలకుల్లో చిత్తశుద్ధి లోపించింది. తొలి ఏడాది మొక్కు బడిగా నిధులు విడుదల చేసి మమ అనిపించిన నాటి ప్రభుత్వం ఆ తర్వాత నాలుగేళ్లు పాడి రైతుల గోడును ఆలకించిన పాపాన పోలేదు. ప్రభుత్వం ఇచ్చే పరిహారంపై ఆశలు పెట్టుకున్న పాడి రైతులు సొంతంగా బీమా చేయించడం కూడా మానేశారు. దీంతో వారి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. పశుపోషణ మీదే ఆధారపడి బతుకీడ్చే కుటుంబాలు అవి మరణించడంతో పాటు ప్రభుత్వం ఇస్తానన్న సాయం అందకపోవడంతో జీవనోపాధి కోసం అగచాట్లు పడాల్సి వచ్చింది.

* ఎదురుచూపులతోనే ఏళ్లు..

పశు నష్ట పరిహారం పథకం కింద పశువులు చనిపోతే దేశీయ రకాలను బట్టి రూ.30,000, 15,000 ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. గొర్రెలు, మేకలకు రూ.6,000 చొప్పున అందిస్తామన్నది. నాలుగేళ్ల వ్యవధిలో గేదెలు, ఆవులకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 3,000, గొర్రెలు, మేకలకు సంబంధించి 4,000 దరఖాస్తులు వచ్చాయి. ఆయా దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేశారు. అయితే వీటిలో ఏ ఒక్కరికి కూడా పరిహారం ఇవ్వలేదు. పైగా వారిని కార్యాలయాల చుట్టూ నాలుగేళ్లు తిప్పుకున్న ఘనత గత ప్రభుత్వానిది. 2019లో బీమా ప్రీమియానికి సంబంధించి రైతుల వాటా కూడా తామే చెల్లిస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వం సాయం చేయకపోగా 2023కు వచ్చేసరికి పశుబీమా అంటూ మరో కొత్త నాటకానికి తెరలేపింది. రైతులే ప్రీమియం వాటా చెల్లించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఇలా పథకాల పేర్లు మార్చే ఆర్భాటాలే తప్ప వైసీపీ హయాంలో పాడిరైతులకు అందించాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి.



* ఎన్నికల హామీ అమలు..

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పాడి రైతుల బకాయిలను ఇటీవలే విడుదల చేసింది. గత ప్రభుత్వం పరిహారం పేరిట పాడి రైతులను వంచిస్తే వాటికి సంబంధించిన నిధులను కూటమి పాలకులు విడుదల చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలివిడతలో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 2,500 మంది పాడి రైతులకు లబ్ధి చేకూరింది. జిల్లాల వారీగా చూస్తే బాపట్ల జిల్లాలో 750 మందికి రూ.2.10 కోట్లు, గుంటూరు జిల్లాలో 1100 మందికి రూ.2.50 కోట్లు, పల్నాడు జిల్లాలో 650 మందికి రూ.1.60 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. గత ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పశునష్ట పరిహారం కోసం వచ్చాయని వాటిల్లో చాలావరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో అర్హత కలిగిన వారందరికీ త్వరలోనే న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు.

* పశు బీమా అమలు..

పశు బీమా పథకానికి సంబంధించి కొన్ని మార్పులు చేసి మార్గదర్శకాలను గతేడాదే కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. జీవనాధారమైన పశువులు మరణిస్తే రోజుల వ్యవధిలోనే పరిహారం పాడి రైతు ఖాతాలో జమయ్యేలా చర్యలు చేపట్టింది. పాడి పశువులకు చెల్లించే బీమా సొమ్ములో ప్రభుత్వం రాయితీ కల్పించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకైతే 80 శాతం, మిగిలిన వారికి 50 శాతం రాయితీపై బీమా ఫలాలు అందేలా నిర్ణయం తీసుకుంది. మామూలు పశువులకు రూ.15వేలు, మేలు జాతి వాటికి రూ.30 వేల బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇంతకంటే ఎక్కువ మొత్తాలకు బీమా చేసుకోవాలని రైతులు అనుకుంటే అదనంగా ఖర్చయ్యే మొత్తాన్ని సొంతంగా భరించాలని మార్గదర్శకాలలో ప్రభుత్వం తెలిపింది.

శాంతిభద్రతల పరిరక్షణలో...
ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకం

పోలీసుశాఖ ప్రతిష్ఠ పెరిగేలా సాయుధ బలగాల పనితీరు ఉండాలి

డీ మొబలైజేషన్ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకమని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు నిర్వహించిన డీ మొబలైజేషన్ ముగింపు కార్యక్రమం ఆదివారం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగింది. పరేడ్ పరిశీలన వాహనంలో పోలీసు బలగాలల ప్లటూన్లను ఎస్పీ పరిశీలించి వారి నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో బూత్ స్థాయిలో సాయుధ బలగాలు ఉన్నాయన్నారు. ఏఆర్ సిబ్బందికి విధుల్లో నైపుణ్యం పెంపొందించడానికి ప్రతి సంవత్సరం మొబలైజేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు సమర్థవంతమైన విధుల నిర్వాహణ కోసం శారీరక ధృడత్వానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వృత్తి, వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడంలో జిల్లా ఏఆర్ విభాగానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పోలీసుశాఖ ప్రతిష్ఠ పెరిగేలా సాయుధ బలగాల పనితీరు ఉండాలని తెలిపారు.మొబలైజేషన్‌లో వృత్తి నైపుణ్యాల పెంపునకు ఇన్, అవుట్ డోర్ క్లాస్‌లు, సర్వీస్‌రూల్స్, అత్యాధునిక ఆయుధాలను ఎలా ఉపయోగించాలి, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మాబ్ కంట్రోల్, ఎస్కార్ట్స్, వీఎస్‌వో, బి.డి.టీమ్, బందోభస్తు, మోటారు వెహికల్ డ్యూటీ తదితర అంశాలపై ప్రత్యేక తరగతుల్లో సిబ్బంది శిక్షణ పొందారన్నారు.ఈ కార్యక్రమంలో పరేడ్ కమాండర్ ఆర్ఐ మౌలుద్దీన్, డీఎస్పీలు విజయసారథి, రామాంజనేయులు, జగదీష్‌నాయక్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పరేడ్ వాహనంపై పోలీసు ప్లటూన్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

నష్టాల సహకార సంఘాలు రద్దు?

v కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ v ముఖ్యశాఖల అధికారులకు చోటు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (సొసైటీలు) కొన్ని కనుమరుగు కానున్నాయి. నష్టాల ఊబిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను రద్దు చేసేందుకు రంగం సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఈ ప్రక్రియ ఆరంభం అవుతుంది. ఈ మేరకు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానుంది. కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు అయ్యే ఈ కమిటీలో వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సభ్యులుగా ఉంటారు. ఉమ్మడి జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. అందులో భాగంగా గత కొన్ని సంవత్సరాల ఆడిట్ రిపోర్టులను కూడా పరిశీలించనున్నారు. ఆ తదుపరి వరుసగా నష్టాల బాటలో నడుస్తున్న సహకార సంఘాల రద్దుకు సిఫార్సు చేయనున్నారు. వాస్తవానికి కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ సమావేశం ఇప్పటికే జరగాల్సి ఉంది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో సమావేశం తాత్కాలికంగా వాయిదా పడినట్లు తెలిసింది.

30 సంఘాలు ఎప్పుడూ నష్టాల బాటే..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 167 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 30 సంఘాలు ఎప్పుడూ నష్టాల ఊబిలో నే ఉంటున్నాయని చెబుతున్నారు. కేంద్రం కొరడా ఝుళిపించటంతో ప్రస్తుతం ఈ 30 సంఘాలు రద్దు కావచ్చు అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అధికారుల కమిటీ పరిశీలనలో మరికొన్ని సంఘాలు కూడా బయట పడే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద ఈ అంశం కొంత ఇబ్బంది కరమైనదే అని సహకార శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదిక తాత్కాలికంగా రద్దు : కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి ఓ ప్రకటనలో పేర్కొన్నా రు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి సుదూరప్రాంతాల నుంచి అర్జీలివ్వటానికి కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన తెలిపారు.

పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు : ఎస్పీ

బాపట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీలు ఇవ్వటానికి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వచ్చే వారు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి పరామర్శ


చినమల్లవరలో టీడీపీ నేతఅనంతరామయ్యను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : పలు బాధిత కుటుంబాలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. మండలంలోని చినమల్లవరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేత చిలుకూరి వాసుబాబును పరామర్శించి కుటుంబ సభ్యుల ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న అనంతరామయ్యను పరామర్శించారు. పక్షవాతంతో బాధపడుతున్న బోడవల్లి చిన అంజమ్మను, కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వెలటూరి వెంకటేశ్వర్లును గొట్టిపాటి పరామర్శించారు. అనంతరం బూదవాడలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన గూడ సాంబశివరావు, చేజర్ల వీరాస్వామి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ప్రమాదవశాత్తు చేతి వేలు పోగొట్టుకున్న తెలుగు యువత అధ్యక్షుడు భవనం రామిరెడ్డిని మంత్రి పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, షేక్ మస్తాన్‌వలి, సహదేవుడు, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, సర్పంచ్ వీరయ్య, వెంకటరావు, కాజా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి విగ్రహ ప్రతిష్ఠలో కరణం పూజలు

పంగులూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేష్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో అందరికీ ఆనందం

ఎమ్మెల్యే కొండయ్య


పిట్టువారిపాలెంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతన కలిగి ఉన్నప్పుడే ఆనందంగా జీవిస్తారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం, వేటపాలెం మండల పరిధిలోని డిగ్రీ కళాశాల సమీపంలో శ్రీశ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానంలో పల్నాటి అంకమ్మ తల్లి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు. ఈక్రమంలో ఆయా దేవస్థానాల కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతంపలికారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాఘవరావు వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

మేదరమెట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు వర్ధంతి సందర్భంగా పమిడిపాడులో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 250 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మోకాలి ఆపరేషన్ అవసరమైనవారికి ఉచితంగా చేస్తామని డాక్టర్ మనోజ్ తెలిపారు. రాఘవరావు కుమార్తె విక్రమ్‌తులసి, ఆమె భర్త విక్రమ్ శివాజీ మాట్లాడుతూ నాన్న ఆశయాల సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు.



టీడీపీ నేతకు కన్నీటి వీడ్కోలు

వెంకటకృష్ణ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి


వెంకటకృష్ణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాలర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పర్చూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నేత అగ్నిగుండాల వెంకటకృష్ణారావు ఆదివారం స్వగ్రామం పర్చూరులో అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత కృష్ణారావు నివాసానికి చేరుకొన్న ఎమ్మెల్యే ఏలూరి ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో కలసి వెంకటకృష్ణ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. వెంకటకృష్ణ తొలి నుంచీ పార్టీలో పనిచేస్తూ టీడీపీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆయన మరణం పార్టీకి లోటన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఏలూరితోపాటు, పార్టీ నేతలు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, కొల్లా శివరాం ప్రసాద్, తంగెళ్ల మల్లికార్జునరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, ధూళిపల్లి వెంకటస్వామి, కొల్లా శ్రీనివాసరావు (ఫ్యాక్టరీ), జమాలుద్దీన్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, హరిప్రసాద్, కొల్లా చంద్రం, అడ్డగడ రాముడు, పొన్నం శివ, కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి కృషి చేయండి


నూతన కమిటీ ప్రతినిధులను సత్కరిస్తున్న హేమంత్‌కుమార్

చీరాలటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీజేపీ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ బండారుపల్లి హేమంత్‌కుమార్, కార్యదర్శి కాకర్ల శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పార్టీ మండలాధ్యక్షుడు బక్కా మనోహర్ అధ్యక్షతన పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా పార్టీ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించుకుని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. సంస్థాగత ఎన్నికల్లో ఏకగ్రీవమైన జీ భవాని, మనోహర్, విద్యాధర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శంకర్‌శెట్టి నాగేశ్వరరావు, నాశన మణికుమార్, భరణి, సుబ్బారావు, శివాజీ, సుజాత, రామస్వామి, హనుమంతురావు, రఘునాథ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.





అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన


అన్నం వడ్డిస్తున్న ఎస్సై వెంకట్రావ్, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీహరి, జనసేన పార్టీ నాయకులు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రవాసాంధ్రుడు, నియోజకవర్గ జనసేన పార్టీ యువనాయకుడు మన్నెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కారంచేడులో డొక్కా సీతమ్మ పేరుతో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కాల్వసెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై వెంకట్రావు, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, జనసేన నాయకులతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో నారిశెట్టి ప్రవీణ్ కుమార్ రామకృష్ణ స్వామి, ప్రతీఫ్ జ్యోతి, పవన్‌కుమార్, కిషోర్‌బాబు, రామకృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతివ్యక్తి తన ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీరామ్ సూపర్ స్పెసాలిటీ హాస్పటల్ ఎండీ డాక్టర్ చాపల వంశీకృష్ణ అన్నారు. జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని రేణంగివరంలో ఆదివారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, వైటల్ హెల్త్ కేర్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ నేత, శిబిర నిర్వాహకులు బొరెడ్డి ఓబుల్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో 250 మంది రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామలింగారెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పసుపులేటి సుధీర్, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ సౌమిత్రపల్లవ్, దంతవైద్య నిపుణుడు డాక్టర్ సరయురెడ్డి, డాక్టర్ సుమంత్ ఆయా విభాగలకు సంబందించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మ్యాక్సీ విజన్, జాయ్ హాస్పటల్ ప్రతినిధులు, మార్కెటింగ్ మేనేజర్ ఖాశీం సైదా, గోపి, అనిల్, శ్యామ్, వైటల్ కేర్ సంస్థ ప్రతినిధులు రాజేష్, వందనం పాల్గొన్నారు.






స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని చూపాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని చూపాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్, ఇన్‌చార్జి కాటి మార్క్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మండలాధ్యక్షునిగా మైలపల్లి పాల్‌ను నియమించారు. ఈసందర్భంగా పార్టీ కండువాతో ఆయన్ని సత్కరించారు. నియోజకవర్గ కార్యదర్శిగా పఠాన్ కలామ్, పట్టణ ఉపాధ్యక్షునిగా రమణను నియమించారు. కార్యక్రమంలో దొడ్డ భాస్కరరావు, సుధాకర్, బాబు, నూకరాజు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగ.. తప్పిన పెనుప్రమాదం

బల్లికురవ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆదివారం విద్యుత్ మెయిన్ లైన్ వైరు అకస్మాత్తుగా పెద్ద శబ్దంతో తెగి నేలపై పడింది. దీంతో ప్రజలు భయాందోళనతో పరుగులు పెట్టారు. ఆదివారం ఉదయం కావడం పలు గ్రామాల నుంచి ప్రజలు చికెన్ దుకాణాల వద్దకు రాగా విద్యుత్ వైరు తెగి పడడంతో సమీపంలో ఉన్న ప్రజలకు పెను ప్రమాదం తప్పింది. ఉదయం ఆరు గంటల సమయంలో ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌ను నిలుపుదల చేసి 10 గంటల సమయంలో తెగిపడిన తీగను సరిచేసి మరలా విద్యుత్‌ను పునరుద్ధరించారు.



రెండు వర్గాలుగా విడిపోయి యువకుల ఘర్షణ

పోలీసుల రాకతో పరారు

అద్దంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని అభ్యుదయనగర్ కాలువ కట్టపై యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షపడ్డారు. పోలీసుల రాకతో అక్కడ నుంచి పరారయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సమీప కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు స్థానికంగా ఉన్న యువకులు ఆదివారం రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన సీఐ సుబ్బరాజు వెంటనే పోలీసులను పంపారు. పోలీస్ వాహన సైరన్‌ను విన్న యువకులు పరుగు లంకించారు.





బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కార్యాలయం వద్ద వైస్ చైర్మన్ల ఎన్నిక కోసం చేస్తున్న ఏర్పాట్లు

నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఎన్ఎంసీ కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత
- బుచ్చిలోనూ నేడే వైస్‌చైర్మన్ల ఎన్నిక
- కౌన్సిల్ హాలులో పకడ్బందీగా ఏర్పాట్లు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 2,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక నేడు(సోమవారం) నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్ఎంసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10 గంటలకు కౌన్సిల్ హాల్లో ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే కార్పొరేటర్లు, ఓటు హక్కునున్న ప్రజాప్రతినిధులకు సమాచారం అందచేశారు. 54 మంది కార్పొరేటర్లలో డిపూటీ మేయర్‌గా ఉన్న ఖలీల్‌అహ్మద్ రాజీనామా చేయడంతో ఆ సంఖ్య 53కి చేరింది. వీరిలో 41 మంది అధికార టీడీపీలో ఉండగా, ప్రతిపక్ష వైసీపీలో 12 మంది మాత్రమే ఉన్నారు. అటు టీడీపీ, ఇటు వైసీపీ నేడు జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నికకు సిద్ధం కావడంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అనుమతి ఉన్నవారినే లోపలకు పంపనున్నారు. ఈ ఎన్నిక నేపథ్యంలో అధికార పార్టీలో మంత్రులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించి అనుసరించాల్సిన వ్యూహంపై దిశనిర్దేశం చేశారు. ఇటు వైసీపీలో సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా కరీముల్లాకు బీఫాం అందచేశారు. పార్టీ విప్‌గా మరో కార్పొరేటర్ నాగార్జున్‌కు బాధ్యతలు అప్పగించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నగర కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

బుచ్చిలో నేడే వైస్ చైర్మన్ల ఎన్నిక

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : బుచ్చి నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎన్నికలు సోమవారం కౌన్సిల్‌హాల్‌లో జరగనున్నాయి. ఎన్నికల ప్రొసీడింగ్ అధికారిగా డీపీవో శ్రీధర్‌రెడ్డి వ్యవహరించనున్నారు. ఈ మేరకు కౌన్సిల్ హాల్ లోనూ, నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.. ముగ్గురు సీఐలు, ఆరుగురుఎస్సైలు, 50మంది పోలీ సులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది 30 మంది, కౌన్సిలర్లు 20మంది, ఎమ్మెల్యేను, అనుమతి ఉన్న విలేకరులకు లోపలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీ విప్‌గా షాహుల్

వైస్ చైర్మన్ల ఎన్నికలపై నిన్నటి వరకు స్తబ్దుగా ఉన్న వైసీపీ నేతలు ఆదివారం రంగంలోకి దిగారు. ఆపార్టీకి చెందిన ఐదో వార్డు కౌన్సిలర్ ఎస్‌కే.షాహుల్‌ను విప్‌గా నియమించారు. కాగా 12, 16 వార్డుల కౌన్సిలర్లు యానాదిరెడ్డి, ప్రమీలమ్మను వైస్ చైర్మన్ల అభ్యర్థులుగా ప్రకటించారు.

- నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని సాయిబాబా గుడి ప్రాంతంలో ఇటీవల గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. ఆ ప్రాంతంలోని వ్యాపార దుకాణాల వద్దకు వెళ్లి దౌర్జన్యం చేశాడు. 'తానో పెద్ద రిస్కర్‌ను అని, అడిగినవి ఇవ్వకుంటే అంతుచూస్తా'నని బెదిరించాడు. సామాన్య వ్యాపారులు ఆ రౌడీషీటర్ జోలికి వెళ్లలేక భయంతో కాలం గడుపుతున్నారు.
- ఐదు రోజుల క్రితం అదే ప్రాంతంలోని ఓ దుకాణం వద్దకు కొందరు అల్లరిమూకలు వెళ్లి రౌడీయిజం చేస్తుండగా ఓ దుకాణం యజమాని ఎదురుతిరిగాడు. దీంతో వారి మధ్య పెద్ద గొడవ జరిగింది. ఆ యువకులు విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న టెంకాయలు నరికే కత్తితో దుకాణం యజమానిని నరికేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు అప్రమత్తమవ్వడంతో ప్రమాదం తప్పింది. ఆ తర్వాత ఆ అల్లరిమూకే బ్లేడుతో గొంతు కోసుకొని తన చావుకు ఆ దుకాణం యజమాని కారణమంటూ నానా రభస సృష్టించారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పారు తప్ప... ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- నగరంలోని బీవీనగర్ ప్రాంతంలో కొందరు ఆకతాయిలు ఓ ముఠాగా ఏర్పడి ఇటీవల అర్ధరాత్రి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరిలో కొందరు రౌడీషీటర్లు కూడా ఉండడం గమనార్హం. రాత్రిళ్లు మద్యం తాగి రోడ్లపై వెళ్లే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సంక్రాంతి పండుగనాడు ఈ ఆకతాయిల ముఠా వీధుల్లో ఉన్న కార్ల అద్దాలు ధ్వంసం చేసింది. సుమారు పది కార్ల అద్దాలను పగలగొట్టింది. ఆ వీడియోలు కూడా బయటకు వచ్చాయి. మరికొంతమంది ఆకతాయిలు ఉదయం, సాయంత్రం వేళల్లో కేఎన్ఆర్ పాఠశాల వద్ద తిష్ఠ వేస్తూ పాఠశాలకు వచ్చిపోయే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.ఈ విషయాలను బయటకు చెప్పుకోవాలంటే వారు భయపడుతున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

రెచ్చిపోతున్న అల్లరి మూకలు

- దుకాణాల వద్ద దాదాగిరి • ఎదిరిస్తే దాడులకు తెగబడుతున్న వైనం
- అర్ధరాత్రి వేళ కారు అద్దాల ధ్వంసం • గంజాయి మత్తులోనే దాడులు
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసులు • భయాందోళనకు గురవుతున్న నగర వాసులు


ఇవే కాదు.. ఇలాంటి సంఘటనలు ఇటీవల నెల్లూరు నగరంలో ఎక్కువయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలాంటి అరాచకాలు అధికంగా జరిగేవి. అవి ఇంకా కొనసాగుతుండడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రశాంతతకు మారుపేరైనా సింహపురి గడ్డపై కొందరు అల్లరిమూకలు హల్‌చల్ చేస్తున్నారు. వీరిలో కొందరు రౌడీషీటర్లు ఉంటుండగా, మరికొందరు ఇప్పుడిప్పుడే రౌడీషీటర్లుగా రూపాంతరం చెందే స్థాయిలో ఉన్నారు. రోడ్లపై వీరు చేస్తున్న రచ్చ అంతా ఇంతా కాదు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా ఏర్పడడం, రోడ్లపై వెళ్లే వారిపట్ల అసభ్యకరంగా కామెంట్లు చేయడం అలవాటుగా మారింది. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు కూడా వెనకాడడం లేదు. ఇంకొందరు ఆకతాయిలైతే వ్యాపార దుకాణాల వద్ద దాదాగిరి చేస్తు న్నారు. తాము అడిగినవి ఇవ్వాలంటూ బెదిస్తున్నారు. రాత్రివేళ రోడ్లపైనే మద్యం సేవిస్తూ స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ ఆకతాయిల్లో గంజాయి బానిసలే ఎక్కువగా ఉంటున్నట్లు తెలుస్తోంది.



నెల్లూరు నగరంలోని బీవీ నగర్‌లో అర్ధరాత్రి వేళ కారు అద్దాలు ధ్వంసం చేస్తున్న ఆకతాయిల ముఠా(ఫైల్)

పాత నేరస్థుల అనుచరులుగా..

ఇటీవల నెల్లూరులో జరిగిన పలు హత్యల్లో పాత నేరస్థుల పాత్ర ఉన్నట్లు పోలీసుల విచారణల్లో తేలింది. వారి అనుచరులుగా ఈ ఆకతాయిలు మెలుగుతున్నారు. వీరి ఆగడాల గురించి పోలీసులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఇటీవల బీవీ నగర్‌లో ఓ ఆకతాయి గంజాయి మత్తులో దుకాణాల వద్ద కత్తి, బ్లేడుతో హల్‌చల్ చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఆకతాయిలను అదుపు చేయకపోతే రేపటి రోజున వీరే రౌడీషీటర్లుగా తయారవుతారన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. రౌడీషీటర్లు, ఆకతాయిల ఆగడాలు పోలీసులకు తెలిసినా వారి జోలికి వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రౌడీషీటర్ల జోలికి వెళితే వెంటనే రాజకీయ నాయకులు రంగంలోకి దిగుతున్నారని, ఇదే ఇబ్బందిగా మారిందంటూ ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యాఖ్యానించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



- దెబ్బతిన్న విద్యార్థుల పఠనా సామర్థ్యం
- గత ప్రభుత్వ విద్యా సంస్కరణలే కారణం
- అసర్ నివేదికలో వెల్లడి
- నిపుణుల ఆందోళన

చదవలేరు.. లెక్కలు చేయలేరు !

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యార్థుల పఠనా సామర్థ్యాలు దారుణంగా దెబ్బతిన్నాయి. తాజాగా ప్రథమ్ అనే సంస్థ వెల్లడించిన వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక (ఆసర్-2024) ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు సగం మంది తెలుగు పాఠాన్ని తప్పులు లేకుండా చదవలేకపోవడం, గణితంలో కూడికలు, తీసివేతలు కూడా చేయలేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా నివేదికలో పేర్కొంది.

సగంమంది కూడా చదవలేరు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులు దాదాపు సగం మంది కూడా రెండోతరగతి పాఠాన్ని తప్పులు లేకుండా చదవలేక పోతున్నారని, కూడికలు, తీసివేతలు, భాగాహారాలు సైతం చేయలేకపోతున్నారని ఆసర్ సర్వే వెల్లడించింది. జిల్లాలో ఎంపిక చేసిన సుమారు 50కిపైగా గ్రామాల్లో 3 నుంచి 16 ఏళ్ల వయసున్న విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు, 14 నుంచి 16 ఏళ్ల వయసు వారిలో డిజిటల్ అక్షరాస్యతపై సర్వే నిర్వహించి వివరాలు ప్రకటించింది. 3, 4, 5 తరగతులు, 6, 7, 8 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను వేర్వేరుగా పరిశీలించారు. రెండో తరగతి తెలుగు పాఠాలు, భాగాహారాలు, తీసివేతలపై పరీక్షించగా, చిన్నచిన్న పదాలను సైతం చదవలేకపోతున్నారని, తీసివేతలు, భాగాహారాలు కూడా చేయడంలో వెనుకబడి ఉన్నారని గుర్తించింది. 2022-23తో పోలిస్తే 2024లో 6 నుంచి 8వతరగతి విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు బాగా తగ్గాయని పేర్కొంది. 2024 సర్వేప్రకారం 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 63.3 శాతం మాత్రమే బడికి వెళుతున్నారని, 3, 4, 5 తరగతుల విద్యార్థులు రెండో తరగతి వచనం 27.4శాతం మంది మాత్రమే చదవగా, 52శాత మంది మాత్రమే లెక్కలు చేశారని వెల్లడించింది. అలాగే 6, 7, 8 తరగతి విద్యార్థులను ప్రశ్నిం చగా, 47.7శాతం మంది చదవగా, 33.9శాతం మంది మాత్రమే లెక్కలు చేయగలిగారని, ఇది ఆందోళన కలిగించే అంశ మని పేర్కొంది. విద్యావ్యవ స్థలో మార్పులు చేపట్ట కుంటే విద్యార్థుల పాఠనా సామర్థ్యాలు మరింత దెబ్బతినే ప్రమాద ముందని అసర్ తన నివేదికలో వెల్లడించింది.

ఆకట్టుకున్న డాగ్ షో

- అందాల పోటీకి 106 పెంపుడు కుక్కలు • జిల్లాకు 26 జాతులకు చెందినవి రాక
- ఓవరాల్ ఛాంపియన్‌గా డాబర్‌మెన్



దర్పం చూపుతున్న పోలీసు జాగిలం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని వీఆర్సీ మైదానంలో ఆదివారం నెల్లూరు కెన్నెల్ క్లబ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా జరిగిన శునకాల అందాల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలకు మొత్తం 106 పెంపుడు కుక్కలను వాటి యజమానులు తీసుకువచ్చారు. 26 జాతులకు చెందిన శునకాల్లో జర్మన్‌షపర్డ్ 30, లాబ్ 13, రాట్‌విల్లర్ 5, షిజ్జు 8, డాబర్‌మెన్ 4, సైబీరియన్ హస్కీ 5, వాక్సన్ 3, స్పిడ్జ్ జాతి చెందిన మూడు కుక్కలతోపాటు వివిధ జాతుల శునకాలు ప్రేక్షకులను అలరించాయి. జేసీ కే కార్తీక్ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా పశుసంవర్ధకశాఖ జేడీ కే రమేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ సోమయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. పోటీలకు వచ్చిన శునకాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ప్రదానం చేశారు. ఈ ఏడాది ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఎం.నరేష్ (డాబర్‌మెన్) గెలుచుకున్నారు. పోటీల న్యాయనిర్ణేతలుగా కోయంబత్తూరు నుంచి వచ్చిన డాక్టర్ చుండి శుభకర్, ప్రత్యేక ఆహ్వానితులు భార్గవి ఆటో మొబైల్స్ ఎండీ కొండా నిరంజన్‌రెడ్డి, గౌరవ సలహాదారులు వెంకటస్వామిరెడ్డి వ్యవహరించారు. పాల్గొన్నారు. నెక్ జోనల్ చైర్మన్ ఎన్.బలరామయ్య నాయుడు శునకాలకు ఉడికించిన కోడిగుడ్లను ఉచితంగా అందచేశారు. కార్యక్రమాన్ని కెన్నల్ క్లబ్ చైర్మన్ బొబ్బా శ్రీనివాసయాదవ్, కార్యదర్శి బీ సురేంద్రకుమార్, కోశాధికారి ఐ.రాజా, డాక్టర్లు జయచంద్ర, రమణయ్య, తదితరులు పర్యవేక్షించారు.





పోటీలకు వచ్చిన శునకాలను తిలకిస్తున్న నగర వాసులు

'రెవెన్యూ'లో ఏజెంట్లు

నెల్లూరు నగర కార్పొరేషన్‌లో నిన్న మొన్నటి వరకు ఉన్న ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టరు)లు గుడిని మింగితే.. వారి స్థానంలో కొత్తగా వచ్చినవారు గుడితోపాటు గుళ్లో లింగాన్ని కూడా మింగుతున్నారు. గతంలో పదిమంది ఆర్ఐలు 54 నగర డివిజన్లకు ఉండగా, వారి స్థానంలో ఆరుగురిని నియమించారు. వీరంతా ఈ పోస్టులకు కొత్తవారే అయినా విపరీతంగా మామూళ్లకు పాల్పడుతున్నారు. కొత్త భవనాలకు అసెస్‌మెంట్ వేయాలంటే ఏకంగా రూ. 50 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు.ఇళ్ల క్రయవిక్రయాల్లో ఒకరి పేరుపై ఉన్న ఇంటిపన్నును మరొకరి పేరులోకి మార్చడానికి రూ. 30 వేలు తీసుకుంటున్నారు. కాగా ఇళ్లకు తక్కువ పన్ను వస్తుందని ఆయా యజమానులను బెదిరించి, అందినకాడికి దండుకుంటున్నారు. వీరి అవినీతి దాహానికి ఆయా డివిజన్లలోని ప్రజాప్రతినిధులు కూడా హడలెత్తిపోతున్నారు. ఏసీబీ వరకు వీరి అవినీతి వ్యవహారం వెళ్లడంతో వారెక్కడ పట్టుకుంటారోనని తమ తరఫున ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

-నెల్లూరు(సిటీ),(ఆంధ్రజ్యోతి)

- మామూళ్ల వసూళ్ల కోసం ఏర్పాటు • ఏసీబీకి దొరక్కుండా ఆర్ఐల కొత్తమార్గం
- కొత్త భవనానికి రూ. 50వేలు, పేరు మార్పిడికి రూ. 30వేలు
- ముక్కుపిండుతున్న కొత్త అధికారులు
- డివిజన్లలో హడలెత్తిపోతున్న ప్రజాప్రతినిధులు

నెల్లూరు నగరానికి తూర్పు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు ఆర్ఐగా ఉన్న ఓ వ్యక్తి రెవెన్యూ విభాగంలో వసూల్‌రాజాగా మారాడు. నిర్మించిన భవనంతో సంబంధం లేకుండా కనిష్ఠంగా రూ. 50 వేలు ఇస్తేనే పన్ను వేస్తానంటూ తెగేసి చెప్తున్నాడు. పన్నులో పేర్లు మార్చాలని ఒకరు ఆయన వద్దకెళ్లగా రూ. 30 వేలు ఇస్తేనే పని జరుగుతుందని స్పష్టం చేశాడు. చివరికి ఆ డివిజన్‌లోని కార్పొరేటర్లు జోక్యం చేసుకుని చెప్పినా ససేమిరా అనడం విశేషం. తూర్పు భాగాన ఇప్పటికే అభివృద్ధి చెందిన మరో ప్రాంతానికి ఆర్ఐగా ఉన్న అధికారి ఖరీదైన భవంతిని ఎంచుకుని, పన్ను పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. తాను అడినంత ఇవ్వకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై సదరు ఇంటిలోని మహిళ కమిషనర్‌కు లేఖ రాయడం కార్పొరేషన్‌లో తాజా చర్చనీయాంశంగా మారింది. ఉత్తరాన విస్తరిస్తున్న ప్రాంతానికి ఆర్ఐగా వ్యవహరిస్తున్న వ్యక్తిని పన్నులో పేరు మార్చాలని కోరగా, ఎలా అంటే అలా మార్చరని, తనను కలిస్తేనే మార్పు తారంటూ తెగేసి చెప్పడం గమనార్హం.



వసూళ్లకు సాకుగా సర్వే

నగరంలోని భవనాలు తాజా పరిస్థితులకు అనుగుణంగా పన్ను ఉందా.. లేదా..? అని పరిశీలించేందుకు రెవెన్యూ విభాగం సర్వే నిర్వహిస్తున్నది. ఈ సర్వేను కొత్తగా వచ్చిన ఆర్ఐలు తమ వసూళ్ల దందాకు సాకుగా మలుచుకుంటున్నారు. నగరంలోని ఖరీదైన ప్రాంతాలను ఎంచుకుని మీ ఇంటికి పన్ను తక్కువగా వస్తున్నది... పెంచాలి...అని చెప్తూ అలా చేయకుండా ఉండాలంటే తమకు డబ్బులు ఇవ్వాలని బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు. కృష్ణ పట్నం పోర్టు కు వెళ్లే దారిలో ఓ విద్యా సంస్థకు ఈ తరహా డిమాండ్ నోటీసు ఇచ్చిన ఆర్ఐ తనకు డబ్బులిస్తే అంతా సాఫీగా జరిగిపోతుందని చెప్పాడు. ఇదే తరహా లోనే కోడూరుపాడుకు వెళ్లే రహదారి వెంబడి ఉన్న ప్రాం తంలోనూ స్థానిక ఆర్ఐ వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి.

వసూళ్ల కోసం ఏజెంట్లు

కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం ఆర్ఐలు మితిమీరిన అవినీతికి పాల్పడుతున్నారని గ్రహించిన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వారిని ఎలాగైనా పట్టుకోవాలని వల విసిరేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పలు ఫిర్యాదులు ఆ శాఖ వద్ద ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన కొత్త ఆర్ఐలు నగదు వసూళ్లకు ఏజెంట్లను నియమించుకున్నారు. భవనాల పరిశీలన, పన్ను హెచ్చుతగ్గుల ఆరా, పేర్లు మార్పిడి వ్యవహారమంతా వారికే అప్పగించారు. అవినీతి రూపేణా తీసుకుంటున్న ప్రతి రూపాయిని కూడా ఏజెంట్ల ద్వారానే పొందుతున్నారు. మొత్తంమీద ఎన్ఎంసీ రెవెన్యూ విభాగంలో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం కన్నా, ఆర్ఐలకు వ్యక్తిగతంగా వచ్చే ఆదాయమే ఎక్కువగా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ. 3.2 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ. 3.2 కోట్లతో నిర్మించనున్న నూతన తారురోడ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.1.2కోట్లతో మండల కేంద్రంలోని ఓవీ రోడ్డులోని మాల్యాద్రికాలనీ (పెద్దఓగూరు జంక్షన్) నుంచి మహదేవపురం వరకు తారురోడ్డు, రూ.2కోట్లతో పలుకూరు అడ్డరోడ్డు నుంచి పలుకూరు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ఈ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల కనెక్టివిటీ రోడ్లను తారురోడ్లుగా మారుస్తామన్నారు. అలాగే ప్రతిగ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించటమే కూటమిప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, బొద్దులూరి కొండలరావు, చిట్టా హరికృష్ణ, అల్లం వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీనివాసరావు, చెంబేటి వీరాంజనేయులు, చెంబేటి హరిబాబు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నం మాలకొండయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి


పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో రజకులు చేపట్టిన పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. మహిళలతో కొంత సేపు ముచ్చటించారు. అనంతరం టీడీపీ నేత గాదంశెట్టి వేణుగోపాల్ స్థానిక ముసునూరు ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ షోరూమ్‌ను ప్రారంభించారు. అలాగే పట్టణంలో పలు వివాహ, నలుగు కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొని వారిని ఆశీర్వదించారు. అనారోగ్యంతో ఉన్న స్థానిక టీడీపీ నేత అనుమలశెట్టి శివను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై వైసీపీ రియల్టర్ల మండిపాటు

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్లలో తెలిసో తెలియక కొన్ని పొరపాట్లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరిగిఉంటాయని వాటిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా సరిచేసు కుంటామని కావలి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెలిపారు. ఈ విషయంపై ఆదివారం వారు స్థానిక కల్యాణ మండపంలో రియల్‌ఎస్టేట్ మీడియేటర్లతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు సమావేశం నిర్వహించారు. వైసీపీ కీలక నాయకులుగా చలామణి అయిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, జనిగర్ల మహేంద్రయాదవ్, ఈతముక్కల బాలమురళీ రెడ్డి, కాటా శ్రీనివాసులు రెడ్డి, జయరామిరెడ్డి, బాబు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తీరుపై విరుచుకుపడ్డారు. లేఅవుట్లలో బెదిరించి వాటాలు తీసుకుని, గ్రావెల్‌కు ట్రిప్పరుకు రూ.2వేలు అదనంగా తీసుకుని అందరికన్నా ఎక్కువగా లబ్ధిపొందిన ఆయన ఇప్పుడు మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలుగా పనిచేశారని ప్రతాప్‌రెడ్డి లాంటి అవినీతి పరుడిని చూడలేదన్నారు. తాము సమావేశం పెట్టుకుంటామని తెలిసి తమను బెదిరించాడన్నారు. ని ఆయన ఇప్పటికీ అధికారంలో ఉన్నట్లు భావిస్తున్నాడని ఆయన బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. ఇప్పటి వరకు ఆయన చేసిన తప్పులలో భాగస్వాములై శిక్షలు అనుభవిస్తున్నామని చెప్పారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

● డీఎస్‌డబ్ల్యూవో శోభారాణి



ప్రసంగిస్తున్న డీఎస్‌డీవో శోభారాణి

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని డీఎస్‌డబ్ల్యువో కె శోభారాణి పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని ఎస్సీ వసతిగృహాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయం వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా జవాబులు రాసేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం తెలుగు, ఇంగ్లీషు, గణితం, హిందీ, సైన్సు సబ్జెక్టులలో నిపుణులైన ఉపాధ్యాయులు, ట్యూటర్ల చేత పరీక్షలు రాసే విధానంలో అనుసరించాల్సిన మెళకువల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, ఉదయగిరి ఏఎస్‌డబ్ల్యువోలు బ్రహ్మానందాచారి, ఆదిలక్ష్మి, పలు మండలాల పరిధిలో ఉన్న ఎస్సీ వసతిగృహాల సంక్షేమాధికారులు, రిసోర్స్‌పర్సన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

లింగసముద్రం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెంట్రాల పంచాయతీ శాగంవారిపాలెం అడ్డరోడ్డులోని శాయిపేట వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో తండ్రి, కొడుకులు కావలికి చెందిన ఎఫ్రాయిమ్, జాయ్‌లు గాయపడ్డారు. బాపట్లకు చెందిన ఎఫ్రాయిమ్ ఆయన భార్య కృప పాస్టర్లుగా ఉంటూ కావలిలో నివాసం ఉంటున్నారు. ఈయన లింగసముద్రం మండలం వెంగళాపురంలో చర్చికి మోటారు సైకిల్‌పై భార్య, కుమారుడితో వెళుతుండగా గొర్రెతో ఉన్న ట్రాక్టర్ వేగంగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో జాయ్(13ఏళ్లు) కాలు విరిగింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి క్షతగాత్రులను కావలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే జాయ్‌ను మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



టీచర్ స్వర్ణలతను సత్కరిస్తున్న ఐఎంఏ బాధ్యులు

కావలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి వైజ్ఞానిక ప్రాంగణంలో పట్టణంలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. అనంతరం ఐఎంఏ గౌరవసలహాదారుడు బెజవాడ రవికుమార్, గణితశాస్త్ర ఉపాధ్యాయులు మహేష్‌లు ఉపాధ్యాయురాలు స్వర్ణలతను సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కామంచి సుబ్బారావు, గోపిక్రిష్ణ, కోశాధికారి పాములూరు శివప్రసాద్, సైన్స్‌క్విజ్ ఆర్గనైజర్లు డాక్టర్ శ్రీరాం మ నోహర్‌బాబు, గంగాధర్‌రెడ్డి, శ్రీచైతన్యకళాశాల ప్రిన్స్‌పాల్ టీ.లుకోధర్, కరస్పాండెంట్లు వెంకయ్య, మధుసూదన్, తోట వెంకటేశ్వర్లు, జానకిరాం, హరినాథ్ పాల్గొన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వేజోన్ మెంబరుగా వేణుయాదవ్

జలదంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేశవరం గడ్డె వేణుమాదవ్‌యాదవ్ సౌత్‌సెంట్రల్ రైల్వేజోన్ సభ్యుడిగా నియామకం అయ్యాడు. బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.క్రిష్ణయ్య సహకారంతో ఈ పదవి వరించిందని ఆదివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన ఆర్.క్రిష్ణయ్య, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వేలో ప్రయాణికుల సౌకర్యాలకు తన వంతు కృషిచేస్తానన్నారు.

రంగా విగ్రహం ఏర్పాటుకు బీస్ విరాళం


నిర్మాణంలో ఉన్న రంగా విగ్రహం వద్ద బీస్ సభ్యులు

కావలిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు బలిజ ఎంప్లాయిస్ అభ్యుదయ సేవాసమితి సభ్యులు రూ.20వేలు విరాళం అందజేశారు. మాగుంట పార్వతమ్మ రోడ్డు రైతుబజార్ వద్ద నిర్మాణంలోనున్న రంగా విగ్రహం వద్ద బీస్ ప్రెసిడెంట్ నాగిశెట్టి శ్రీనివాసులు, సెక్రెరీ చలపతిరావు, సభ్యులు విగ్రహ కమిటీ బాధ్యులు శ్రీనివాసులు, శ్రీనివాసులుకు నగదు అందజేశారు. విడతలవారీగా విగ్రహ నిర్మాణానికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీస్ గౌరవాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, సభ్యులు పాశం శ్రీనివాసులు, సుధాకర్, అమిరిశెట్టి హజరత్తయ్య, వెంకటసతీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యం.. తీవ్ర నష్టం

● బ్యారన్‌లలో అగ్ని ప్రమాదాలు
● నష్టపోతున్న పొగాకు రైతులు


మర్రిపాడు మండలంలో అగ్ని ప్రమాదానికి గురైన బ్యారన్ (ఫైల్)

మర్రిపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి నిర్లక్ష్యంతో పొగాకు రైతుల కష్టం బూడిదపాలు అవుతోంది. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని రైతులు ఎక్కువ మంది వాణిజ్య పంట పొగాకును సాగుచేస్తుంటారు. గత మూడేళ్లగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఏటా సాగుదారులతోపాటు పంట విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గత ఏడాది బోర్డు పరిధిలో 34 బ్యారన్లలో అగ్ని ప్రమాదాలు సంభవించి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నిర్లక్ష్యమే కారణం

పొగాకును క్యూరింగ్ చేసే డ్రైవర్ పర్యవేక్షణ సరిగా లేకపోవడం అగ్ని ప్రమాదాలకు కారణం అవుతోంది. అల్లిన కర్ర, లేదా పైనుంచి ఆకులు రాలి మొద్దు గొట్టంపై పడటం వల్లే బ్యారన్లలో అగ్ని ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. కాల్పు సమయంలో నిరంతర పరిశీలనతోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలమని బోర్డు అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మొద్దుగొట్టంపై తప్పనిసరిగా జల్లెడ (నెట్) ఏర్పాటుచేసుకోవాలి. దీని వల్ల ప్రమాదవశాత్తు కర్ర పైనుంచి పడినా నష్టం ఉండదు. క్యూరింగ్ ప్రారంభానికి ముందే పొయ్యిగొట్టం మొద్దులు అన్నీ సరిగా ఉన్నాయా, లేవో చూసుకోవాలి. ఆకు అల్లికకు సన్నని కర్రలు వాడరాదు. బ్యారన్ లోపల అడ్డంగా ఉండే గుంజలు (టైర్లు) బలంగా ఉండాలి. ఒక విడతకు 1100 కర్రలను మాత్రమే క్యూరింగ్ కోసం ఉంచాలి. లోపల ఉష్ణోగ్రత తెలిపే పరికరం సక్రమంగా పనిచేస్తుందో, లేదో సరిచూడాలి. అందుబాటులో నీళ్ళు ఉంచుకోవాలి. బ్యారన్లకు కచ్చితంగా బీమా చేసుకోవాలి. దీనివల్ల ప్రమాదం జరిగినా పరిహారం రూపంలో పొగాకు రైతులకు సాయం అందుతుంది.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతసాగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటి కంబంపాడులో ఆదివారం హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఆర్ ఆసుపత్రి నెల్లూరు వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నరాల స్పెషలిస్ట్ దువ్వూరు దయాకర్‌రెడ్డి, బి సుధాకర్, నిర్వాహకులు రొండా వెంకటరమణారెడ్డి, చింతగుంట నరసింహారెడ్డి, మస్తాన్‌వలి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మహంత్‌రెడ్డి ఎన్నిక

ఆత్మకూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరుకు చెందిన మహంత్‌రెడ్డి ఎంపిక య్యాడు. విశాఖపట్నంలో జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో జరిగిన ఆంధ్రవిద్యార్థి సంఘం రాష్ట్ర మహాసభల్లో జిల్లా అధ్యక్షుడిగా మహంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహంత్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌రెడ్డికి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తురకా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళి

వింజమూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ నలుమూలల వ్యాపింపచేసిన వ్యక్తి స్వామి వివేకానంద అని రిటైర్డ్ ఉపాధ్యాయుడు శేషగిరిరావు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కందల మధు, పి వెంగయ్య, డేగ మధుయాదవ్, పి వెంగళరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ కూల్చివేత


కూల్చివేసిన వాటర్ ట్యాంక్

సీతారామపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం గ్రామ పంచాయతీలోని రాజుగారి కాలనీలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును ఆదివారం ఎంపిటిసి పాలగిరి అల్లూరురాజు ఆధ్వర్యంలో కూల్చివేశారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి ఆదేశాలతో పంచాయతీ తీర్మానంతో మండల ఎంపీపీ నిధులతో కూల్చివేయించారు.

ప్రమాద బాధితులను రక్షిస్తే నగదు ప్రోత్సాహకాలు


అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు.

కావలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందిస్తుందని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల, ప్రవీణ్, ఆనంద్ వైద్యశాలల్లో ఆదివారం నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర్‌రావు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాదును విజయవంతం చేయాలి : ఎమ్మార్పీఎస్


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకై హైదరాబాదులోని ఎ ల్‌బీ స్టేడియంలో నిర్వహించే లక్షల డప్పులు - వేల గొంతు లు కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని ఎమ్మార్పీ ఎస్ నాయకులు బకీరు జాషు వా, బెజవాడ బాలగురవయ్య కోరా రు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ చేసి పాలకులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. చలో హైదరాబాదు కార్యక్రమానికి నియోజవర్గంలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, మాదిగలు, మాదిగ ఉపకులాలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజా, పెంచలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, దత్తాత్రేయస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా వేదపండితులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి వాటర్ ప్లాంటు వితరణ


వాటర్ ప్లాంటు ప్రారంభిస్తున్న దాతలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రామాపురం గ్రామానికి చెందిన పోకా కుటుంబీకులు నూతనంగా నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటుకు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులకు తమవంతు దాతృత్వంగా ప్లాంటును అప్పగించారు. ఈసందర్భంగా దాతలు పోకా మహేశ్వరరావు, మోహన్‌రావు మాట్లాడుతూ తన సోదరుడు మాల్యాద్రి జ్ఞాపకార్థం నిర్మించిన ప్లాంటును భక్తుల సౌకర్యార్థం ఆలయానికి అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

ఉదయగిరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కర్నూల్‌లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అయితే నెల్లూరు జిల్లాను కర్నూల్‌లో కలపకుండా, అమరావతి హైకోర్టులోనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లా వాసులకు అమరావతి అయితేనే అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి : జేవీవీ


మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మంజిల్‌లో ఆదివారం సీతా రామపురం, ఉదయగిరి, దుత్త లూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన ఉపాధ్యాయు లకు తరగతి గదిని ఆకర్ష ణీయంగా రూపొందించడం ఎలా అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక జాతీయ, రాష్ట్ర నాయకులు బ్రహ్మారెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డిలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తరగతి గదులను విద్యార్థులను ఆకర్షించేలా తీర్చిదిద్ది, సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. సైన్స్ అంశాలకు సంబంధించి పలు విషయాలను దృశ్య రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీలో ఉద్యోగం

బిట్రగుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యువతీయువకులు కష్టపడి చదివితే ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీలతో రైల్వే ఉద్యోగాలు సంపాదించవచ్చని బిట్రగుంట స్టేషన్ మాస్టర్ మోహన్ తెలిపారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.స్వర్ణన్‌రాజ్ ఆధ్వర్యంలో సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి పాస్ అయిన 18-36 ఏళ్ల మధ్య వయసున్న యువత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికి లంచాలు, రెకమండేషన్‌లతో పని లేకుండా ప్రతిభ ఆధారంగా రైల్వే ఉద్యోగం సాధించ వచ్చన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులుయాదవ్, వ్యవస్థాపక అధ్యక్షులు కుందుర్తి శ్రీనివాసులు, రైల్వే లోకోపైలెట్ జీవన్‌కుమార్, రిటైర్డ్ ఓ.ఎస్ గోవిందరాజులు, అసోసియేషన్, వాకర్స్ సభ్యులు ఉన్నారు.

హమ్మయ్య .. ఆకలి బాధ తప్పింది !

● సెలవు రోజుల్లోనూ పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం


ఉదయగిరి ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు డిసెంబరు 1 నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేసి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల పని దినాల్లో మధ్యాహ్న భోజనం అందుతుండగా రెండో శనివారం, ఆదివారాల్లో సెలవు దినాలు కావడంతో కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి భోజనం తెచ్చుకొంటుండగా, మరికొందరు పస్తులుంటున్నారు. దూరప్రాంతాల నుంచి ప్రత్యేక తరగతులకు హాజరు కావాల్సి ఉండటంతో పలువురు విద్యార్థులకు భారంగా మారింది. చాలామంది పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కారణంగానే కొంతమంది పాఠశాలకు రావడం లేదు. ఈ విషయం కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో పది విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించింది. దీంతో ఆదివారం నుంచి మార్చి 10వ తేదీ వరకు ఈ సదుపాయం కల్పించడంతో జిల్లాలోని 341 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల ఆకలి బాధ తీరినట్లయ్యింది. ఈవిషయమై ఎంఈవో షేక్ మస్తాన్‌వలిని వివరణ కోరగా ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అమలు చేస్తున్నామని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● మీసాల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో



దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరుతోపాటు మండలంలో 17 పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు.

? ఎన్ని రోజులకు వాటర్‌ట్యాంకుల క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు.

! ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం.

ఈ ఇంటర్వ్యూ

? సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.

! సచివాలయాలపై నిరంతర పర్యవేక్షణ ఉంచడంతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నాం. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

? చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తారా.

! మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చాం.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు పూజలు


నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు అక్షరాభ్యాసం

ఉలవపాడు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు అర్చకులు హేమంత్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 10.30వరకు జరిగే ఈ కార్యక్రమంలో 3ఏళ్ల నుంచి 5ఏళ్లలోపు చిన్నారులతో సరస్వతీదేవి పూజ చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో ఆదిగురువు పరమేశ్వరుడితో పాటు, సరస్వతీదేవి అనుగ్రహం కలిగేలా పూజలు చేస్తామన్నారు.

అందరి కలలను సాకారం చేసిన కేంద్ర బడ్జెట్

జలదంకి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజల కలలను సాకారం చేసేలా బడ్జెట్ ఉందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈవిషయంపై ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాది రూ.12లక్షల ఆదాయం వచ్చే వారికి ఎలాంటి పన్నులు లేకుండా చేయడం మధ్యతరగతి ప్రజలకు ఉపయోగంగా ఉందన్నారు. కేంద్రబడ్జెట్ 2025-26 ప్రధాని మోదీ దార్శనికత, స్వావలంబన, వృద్ధి, శ్రేయస్సుతో కూడిన వికసితభారత్‌గా కొనియాడారు.

వ్యర్థాలతో నిండిన హైవే సర్వీసు రోడ్డు


సర్వీస్ రోడ్డుపై ఉన్న తాగిపడేసిన కొబ్బరి బోండాలు, వ్యర్థాలు

కావలి రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండాల్సిన వెంగయ్యగారిపాలెం జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు చెత్తచెదారాలు, జంతువ్యర్థాలు, కాలంచెల్లిన మందులు, వాడిపడేసిన నీడిల్స్ తాగి పారవేసిన కొబ్బరి బొండాలతో కంపుకొడుతున్నాయి. అప్పుడప్పుడు వీటిని తగలేస్తుండటంతో రోగాల పాలవుతున్నట్లు ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.